- అక్రమ రవాణాలో అజ్ఞాత వ్యక్తి
- చికెన్ వేస్ట్ సరఫరా, చేపలకు ఆహారంపై ఎనిమిదేళ్ల కిందటే నిషేధం
- తహసీల్దారు నేతృత్వంలో కమిటీ ఏర్పాటు
- అయినా, అడ్డుకోవడానికి వెనకడుగు





కోడిబొచ్చు కథలో కొత్త ట్విస్ట్

'కోడి బొచ్చు' కథ కొనసాగుతూనే ఉంది. కాకుంటే కొత్త ట్విస్టులు బయటపడుతున్నాయి. వైసీపీ హయాంలో చికెన్ వ్యర్థాల మాఫియా బాగోతాన్ని పవన్ కల్యాణ్ దృష్టికి తీసుకెళ్లేలా ఓ అజ్ఞాత వ్యక్తి పావులు కదపడంతో గుట్టు రట్టయింది. కూటమి అధికారంలోకి వచ్చాక ఆ అజ్ఞాత వ్యక్తే చికెన్ వేస్ట్‌ను తన చేతుల్లోకి తీసుకుని చక్రం తిప్పుతున్నట్లు తెలుస్తోంది.

– తిరుపతి, ఆంధ్రజ్యోతి



తిరుపతిలో సేకరిస్తున్న చికెన్ వ్యర్థాలు

ప్రత్యామ్నాయ చర్యలకు కార్పొరేషన్ కసరత్తు

ఇటీవల ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన 'కోడిబొచ్చు కథ ముగియలేదు' కథనంపై కార్పొరేషన్ యంత్రాంగంలో కదలిక వచ్చింది. చికెన్ వేస్ట్‌ను మీట్‌మీల్‌గా మారిస్తే అటు కార్పొరేషన్‌కు ఆదాయంతో పాటు ఇటు వ్యర్థాలను చేపల చెరువులకు తరలించకుండా ఆపొచ్చని భావించింది. వాటిని ఇప్పటికిప్పుడు తరలించకుండా నిలిపివేస్తే ఆ భారం తమపై పడుతుండడంతో శాశ్వత పరిష్కారం కోసం అధికారులు మార్గాలు అన్వేషిస్తున్నారు. మీట్‌మీల్‌కు అవసరమైన డీపీఆర్‌ను సిద్ధం చేసేపనిలో పడ్డారు. రూ.25 లక్షలతో ప్లాంట్ ఏర్పాటు చేయవచ్చని ప్రాథమిక అంచనాకు వచ్చారు. దీనికంటే ముందు ఇన్సినిరేటర్ ద్వారా చికెన్ వేస్ట్‌ను నిర్వీర్యం చేసేందుకు ప్రయత్నాలు ముమ్మరం చేశారు.

తిరుపతిలో నాలుగైదు చికెన్ షాపులున్నాయతడికి. చికెన్ వ్యర్థాలతో లాభాలను గతంలోనే ఆయన రుచి చూశారు. వైసీపీ ప్రభుత్వంలో డిమాండు పెరగడంతో ఆయన తప్పుకోవాల్సి వచ్చింది. గతేడాది సార్వత్రిక ఎన్నికల ముందు కోడిబొచ్చు బాగోతాన్ని కూటమి నేతల చెవిన వేశారు. వీరు పవన్ దృష్టికి తీసుకెళ్లారు. ఈ చికెన్ వేస్ట్ మాఫియా గురించి ప్రజాగళం సభలో పవన్ కల్యాణ్ ప్రముఖంగా మాట్లాడటంతో సర్వత్రా చర్చకు దారితీసిన విషయం తెలిసిందే. ఎన్నికల ముందు ఎవరైతే చికెన్ వేస్ట్ మాఫియా గురించి లీకు ఇచ్చారో.. కూటమి అధికారంలోకి వచ్చాక ఆయనే ఆ మాఫియాను చేతుల్లోకి తీసుకున్నట్లు తెలుస్తోంది.

'వేస్ట్' వెహికల్స్‌ను పట్టుకుని వదిలేసిన పోలీసులు

తిరుపతి నుంచి చికెన్ వేస్ట్‌ను నెల్లూరుకు తరలిస్తున్న 6 మినీట్రక్కులను ఇటీవల కార్పొరేషన్ సిబ్బంది సహకారంలో పోలీసులు పట్టుకున్నారు. మాఫియాను నడిపిస్తున్న వ్యక్తి పైస్థాయిలో పోలీసులమీద ఒత్తిడి తీసుకురావడంతో వాటిని విడిచిపెట్టినట్టు తెలుస్తోంది. దీంతో తనకు అడ్డేలేదన్నట్టుగా యథేచ్ఛగా ఆయన చికెన్ వేస్ట్ రవాణా సాగిస్తున్నారు.

ప్రజారోగ్యంపై తీవ్ర ప్రభావం

చెరువులో వేసే పౌల్ట్రీ వ్యర్థాలు, ఇతర కళేబరాలను చేపలు తినడం.. వాటిని మాంసాహార ప్రియులు భుజించడంతో ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం చూపుతోంది. ఇక, నీరు, నేల కలుషితమమై, ఆక్వా కల్చర్ కూడా దెబ్బతింటుందని వైద్యులు చెబుతున్నారు. ఈ వ్యర్థాలను చేపలకు ఆహారంగా వేయడాన్ని నిషేధిస్తూ ఉత్తర్వులు జారీ చేయాలని మత్స్య రైతుల సంఘం ప్రభుత్వాన్ని అభ్యర్థించింది. చికెన్ వేస్ట్‌తో పాటు కుళ్లిన ఆహార పదార్థాలు చెడిపోయిన గుడ్లు, చర్మాలు తదితరాలను చేపల పెంపకంలో వినియోగించడానికి వీల్లేదని, అలాంటి వ్యర్థాలు రవాణా కూడా చేయకూడదని నిషేధిస్తూ 2016లోని టీడీపీ ప్రభుత్వం ఉత్తర్వులు (జీవో నెం.56) జారీచేసింది.

ఐదుగురితో కమిటీ ఏర్పాటు

తహసీల్దారు చైర్మన్‌గా, మత్స్యశాఖ అధికారి కన్వీనర్‌గా, ఎంవీఐ, సంబంధిత పోలీస్ స్టేషన్ హౌస్ ఆఫీసర్, వీఆర్వో సభ్యులుగా.. ఐదుగురితో నాడు కమిటీని ఏర్పాటు చేశారు. వ్యర్థాలు రవాణా చేస్తున్నా, చేపల చెరువులో వేస్తున్నా కఠిన చర్యలు తీసుకోవడం, వాహన యాజమానులపై జరిమానా విధించడం ఈ కమిటీ ప్రధాన కర్తవ్యం.

కమిటీ ఇలా చేయాలి

కన్వీనర్‌గా వ్యవహరించే ఫిషరీస్ అధికారి తన పరిధిలో కోళ్లు, ఇతర వ్యర్థాలను చేపలకు ఆహారంగా వినియోగించే వాహనాలను గుర్తించి చర్య తీసుకునేందుకు సంబంధిత స్టేషన్‌కు సమాచారం ఇవ్వాలి. మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ చెక్‌పోస్టుల వద్ద నిఘా ఉంచి అక్కడకు వచ్చే వాహనాలను ఆపి సీజ్ చేసి ఫిషరీస్, పోలీస్ అధికారులకు సమాచారం ఇవ్వాలి. దోషులకు వ్యతిరేకంగా శిక్షలు అమలు చేసేందుకు వీఆర్వో సహకరించాలి. ఈమొత్తం వ్యవహారం తహసీల్దారు నియంత్రణలో జరగాలి. కాలుష్య నియంత్రణ, మత్స్యశాఖ, రెవెన్యూ, రవాణా, పోలీసు శాఖలతో కలెక్టర్ సమన్వయం చేస్తూ వ్యర్థాల నిషేధం అమలుకు క్రమం తప్పకుండా పర్యవేక్షించడం నాటి జీవో సారాంశం. వీరెవరూ చికెన్ వేస్ట్ తరలింపును పట్టించుకోవడంలేదన్న విమర్శలు వస్తున్నాయి.

- తొక్కిసలాటపై న్యాయ విచారణ
- ఆందోళనలో అధికారులు
- మంచి నిర్ణయమంటున్న జనం



లోపాలేమిటి.. బాధ్యులెవరు?

తిరుపతి, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): తిరుపతి బైరాగి పట్టెడలోని పద్మావతీ పార్కులో తొక్కిసలాట ఘటనపై రాష్ట్ర ప్రభుత్వం న్యాయ విచారణకు ఆదేశించిన అంశం ఉద్యోగవర్గాల్లో గుబులు రేపుతుండగా, సాధారణ జనంలో మాత్రం ప్రభుత్వ స్పందన పట్ల సానుకూలత వ్యక్తమవుతోంది. వైకుంఠ ఏకాదశి టోకెన్ల జారీ కేంద్రంలో ఈనెల 8న జరిగిన సంఘటన ఆరుగురి మృతికి దారితీసిన విషయం సంచలనంగా మారిన విషయం తెలిసిందే. దీనిపై రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు తక్షణం స్పందించారు. మరుసటి రోజు స్వయంగా తిరుపతి వచ్చారు. తొక్కిసలాట జరిగిన బైరాగిపట్టెడలోని పద్మావతీ పార్కును సందర్శించారు. భద్రతా వైఫల్యంపై కలెక్టర్, ఎస్పీ, టీటీడీ ఈవోలపై ఆగ్రహం వ్యక్తం చేసి మందలించారు. టీటీడీ చరిత్రలోనే తొలిసారిగా పరిపాలనా భవనానికి సీఎం స్వయంగా వచ్చి కలెక్టర్, ఎస్పీ, టీటీడీ అధికారులు, పాలకమండలి చైర్మన్‌లతో సమీక్షించారు. ఆ వెంటనే ప్రాథమిక చర్యల్లో భాగంగా తొక్కిసలాట జరిగిన కేంద్రం వద్ద డ్యూటీలో వున్న క్రైమ్ డీఎస్పీ రమణకుమార్, టీటీడీ గోశాల డైరెక్టర్ హరినాథరెడ్డిలను సస్పెండ్ చేస్తున్నట్టు ప్రకటించారు. వైఫల్యాలకు బాధ్యులుగా భావించి ఎస్పీ సుబ్బరాయుడు, టీటీడీ సీవీఎస్వో శ్రీధర్, టీటీడీ జేఈవో గౌతమిలను బదిలీ చేస్తున్నట్టు ప్రకటించారు. జరిగిన ఘటనపై న్యాయ విచారణ చేయిస్తామని ఆరోజే వెల్లడించారు. అందులో భాగంగా రాష్ట్ర హైకోర్టు రిటైర్డు జడ్జి ఎం.సత్యనారాయణ మూర్తిని విచారణాధికారిగా నియమిస్తూ బుధవారం అసాధారణ గెజిట్ నోటిఫికేషన్ జారీ అయింది. విచారణకు ఆరు నెలల గడువు విధించారు.

న్యాయవిచారణ ఇలా..

- తొక్కిసలాటకు దారితీసిన పరిస్థితులు ఏమిటని గుర్తించడం
- ఘటన జరిగిన కేంద్రంలో ఏర్పాట్లు తగినవిధంగా వున్నాయా? లోపాలుంటే అందుకు బాధ్యులు ఎవరు అని గుర్తించడం.
- భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా తీసుకోవాల్సిన చర్యలపై సూచనలు చేయడం.
- తిరుమల,తిరుపతిల్లో భక్తుల భద్రతకు వ్యవస్థాగతంగా తీసుకోవాల్సిన చర్యలపై సూచనలు చేయడం.

శభాష్ సీఎం!

తొక్కిసలాట ఘటనకు పోలీసు, రెవిన్యూ, టీటీడీ, మున్సిపల్ యంత్రాంగాలలో ఎవరెవరు ఏయే స్థాయిల్లో బాధ్యులో న్యాయవిచారణలో తేలనుంది. ఘటన జరిగిన 15 రోజుల వ్యవధిలోనే రాష్ట్ర ప్రభుత్వం వేగంగా స్పందించి న్యాయ విచారణకు ఆదేశించడం పట్ల సామాన్య జనంలో సానుకూల స్పందన వ్యక్తమవుతోంది. తొక్కిసలాట ఘటన జరిగిన రోజు, మరుసటి రోజు సీఎం స్పందించిన తీరు.. ప్రత్యర్థులను కూడా నోరు తెరవకుండా చేసింది. తనకు సన్నిహితులుగా ముద్ర పడిన అధికారులపై కూడా ఆయన మొహమాటాలకు పోకుండా చర్యలు తీసుకోవడంతో ఆయన ఈ సంఘటనను ఎంత సీరియస్‌గా తీసుకున్నారో అర్థం అవుతోంది. మృతుల కుటుంబాలకు పరిహారాలు, టీటీడీలో ఉద్యోగాలు వంటి నిర్ణయాలు తీసుకున్న తర్వాత కూడా ఈ ఘటనను నీరుగార్చే ప్రయత్నం చేయకుండా సీఎం అదే తీవ్రత కొనసాగించడం చర్చగా మారింది.

అధికారుల్లో గుబులు

న్యాయ విచారణకు ఆదేశిస్తూ బుధవారం నోటిఫికేషన్ జారీ అయిన నేపథ్యంలో తిరుపతి పోలీసు, రెవిన్యూ, టీటీడీ అధికార వర్గాల్లో గుబులు మొదలైంది. టోకెన్ల జారీ కేంద్రాల నిర్వహణకు సంబంధించి జిల్లా రెవిన్యూ, పోలీసు, టీటీడీ యంత్రాంగాల్లో ఉన్నతాధికారుల నుంచీ కిందిస్థాయి ఉద్యోగుల వరకూ పలువురి ప్రమేయం తప్పనిసరి. ఎవరి పరిధిలో వారు తమ విధులను బాధ్యతతో నెరవేర్చాల్సి వుంటుంది.. సాధారణ శాఖపరమైన విచారణలు అయితే అధికారులు, ఉద్యోగులు పెద్దగా ఆందోళన చెందే పరిస్థితి లేదు. అయితే రాష్ట్ర ప్రభుత్వం ఏకంగా హైకోర్టు రిటైర్డు జడ్జితో న్యాయ విచారణకు నిర్ణయం తీసుకోవడంతో బైరాగిపట్టెడలోని టోకెన్ల జారీ కేంద్రం వద్ద విధులకు సంబంధించి ప్రమేయమున్న అధికారులు, ఉద్యోగులు ఆందోళనకు లోనవుతున్నారు. న్యాయ విచారణ ముగిసి నివేదికలో వైఫల్యాలకు ఎవరు బాధ్యులవుతారో అని చర్చించుకుంటున్నారు.

వీరజవాన్‌కు కన్నీటి వీడ్కోలు

- పరిసర గ్రామాల నుంచి వేలాదిగా తరలివచ్చిన యువకులు, విద్యార్థులు
- అండగా ఉంటామని కలెక్టర్ భరోసా



కార్తీక్ మృతదేహంపై జాతీయ జెండా కప్పుతున్న సైనికులు

కార్తీక్



అంత్యక్రియలకు ఊరేగింపుగా వెళుతున్న జనం

బంగారుపాళ్యం, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): జమ్మూ, కశ్మీర్‌లో ఉగ్రవాదులు, సైనికుల మధ్య జరిగిన ఎదురుకాల్పుల్లో వీరమరణం పొందిన యువ జవాన్ కార్తీక్ అంత్యక్రియలు తన స్వగ్రామమైన చిత్తూరు జిల్లా బంగారుపాళ్యం మండలం ఎగువ రాగిమానుపెంటలో బుధవారం సాయంత్రం 3.45 గంటలకు పూర్తయ్యాయి. బెంగళూరు నుంచి రోడ్డు మార్గం ద్వారా ఆర్మీ వాహనాల్లో కార్తీక్ భౌతికకాయాన్ని ఉదయం 6 గంటలకు ఆర్మీ అధికారులు తీసుకొచ్చారు. అతడి స్నేహితులు, గ్రామస్తులు బంగారుపాళ్యం నుంచి ఎగువ రాగిమానుపెంట గ్రామం వరకు ర్యాలీ నిర్వహించారు. కార్తీక్ భౌతికకాయాన్ని చూడగానే తల్లిదండ్రులు సెల్వి, వరదరాజులు, అన్న రాజేష్‌తో పాటు బంధుమిత్రులు భోరున విలపించారు. వీరజవాన్ కార్తీక్‌ను చివరిచూపు చూసేందుకు పరిసర ప్రాంతాల నుంచి పెద్దఎత్తున యువత, విద్యార్థులు తరలివచ్చారు. ఉదయం 11 గంటలకు ఎగువ రాగిమానుపెంటకు చేరుకున్న కలెక్టర్ సుమిత్‌కుమార్, పూతలపట్టు, చిత్తూరు ఎమ్మెల్యేలు మురళీమోహన్, గురజాల జగన్మోహన్, మాజీ ఎమ్మెల్సీ దొరబాబు, చుడా చైర్‌పర్సన్ కఠారి హేమలత తదితరులు కార్తీక్ భౌతిక కాయానికి ఘన నివాళులర్పించారు. వారి కుటుంబాన్ని అన్ని విధాలా ఆదుకుంటామని హామీ ఇచ్చారు. విదేశీ పర్యటనలో ఉన్న సీఎం చంద్రబాబు కార్తీక్ మరణ వార్త తెలిసిన వెంటనే దిగ్భ్రాంతి వ్యక్తం చేశారని ఎమ్మెల్యే మురళి అన్నారు. కార్తీక్ నివాసం ఉంటున్న కాలనీకి ఆయన పేరు పెట్టేలా ప్రతిపాదించామన్నారు. ఆయన చదువుకున్న పాఠశాలలో విగ్రహం ఏర్పాటు చేస్తామని చెప్పారు. కుటుంబంలో ఒకరికి అవుట్ సోర్సింగ్ ఉద్యోగం, అతడి తల్లిదండ్రుల పేరిట ఐదు ఎకరాలు, ఐదు సెంట్ల ఇంటి స్థలం ఇవ్వనున్నట్లు చెప్పారు. కార్తీక్ కుటుంబానికి ప్రభుత్వం అండగా నిలిచేందుకు సీఎం కార్యాలయంతో సంప్రదింపులు జరుపుతున్నట్లు కలెక్టర్ సుమిత్‌కుమార్ చెప్పారు. జీజేఎం ట్రస్టు ద్వారా రూ.50వేల చెక్కును కార్తీక్ తండ్రి వరదరాజులుకు ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్ అందజేశారు. కార్తీక్‌కు సంబంధించిన వస్తువులను, రికార్డులను అతడి తల్లిదండ్రులకు ఆర్మీ అధికారులు అప్పగించారు.



కార్తీక్ భౌతికకాయం వద్ద సెల్వికి కలెక్టర్ పాదాభివందనం

అధికార లాంఛనాలతో అంత్యక్రియలు

గూర్ఖా రైఫిల్స్ బెటాలియన్ లెఫ్టినెంట్ శివరాజ్‌సింగ్ గిల్ ఆధ్వర్యంలో వీరజవాన్ కార్తీక్ భౌతికకాయంపై జాతీయ జెండాను కప్పి గౌరవ వందనం చేశారు. భౌతికకాయాన్ని ఆర్మీ వాహనంలో ర్యాలీగా గ్రామవీధుల మీదుగా తీసుకెళ్లి వారి మామిడి తోటలో అంత్యక్రియలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్మీ జవాన్లు గాలిలోకి మూడు సార్లు కాల్పులు జరిపారు.

హలో.. మేము సీబీఐ

- సరికొత్తగా సైబర్ నేరాలు
- నిందితుడిని అరెస్టు చేసిన తిరుపతి పోలీసులు

- 6లో

ప్రశాంతంగా జేఈఈ మెయిన్స్



తొలిరోజు 89మంది గైర్హాజరు

-6లో

'గీత' కార్మికులకు 23 మద్యం దుకాణాల కేటాయింపు

- అత్యధికంగా ఈడిగకు 15 దుకాణాలు
- నోటిఫికేషన్ జారీ

తిరుపతి(నేరవిభాగం), జనవరి 22(ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం మరో ఎన్నికల హామీల్లో భాగంగా 'గీత' కార్మికులకు గుడ్ న్యూస్ చెప్పింది. వీరికి జిల్లాలో 23 మద్యం దుకాణాలను కేటాయించింది. అందులో ఈడిగలకు అత్యధికంగా 15 కేటాయించారు. ఇక గౌడుకు మూడు, గౌడకు రెండు, గౌండ్లకు మూడు దుకాణాలు కేటాయించారు. ఈ మేరకు కలెక్టర్ బుధవారం నోటిఫికేషన్ విడుదల చేశారు. కలెక్టర్ నేతృత్వంలో లాటరీ తీసి లైసెన్సులకు ఎంపిక చేయనున్నారు. అభ్యర్థులు కుల, నేటివిటీ, ధృవపత్రాలు సమర్పించాలని నోటిఫికేషన్‌లో పొందుపరచారు. ఒక్కో దుకాణానికి ఫీజు రూ.రెండు లక్షలు నాన్ రీఫండబుల్ కింద చెల్లించాలి. ఒక అభ్యర్థి ఆయా ప్రాంతాల్లో కేటాయించిన అన్ని దుకాణాలకు దరఖాస్తు చేసుకునే వీలుంది. కానీ ప్రభుత్వ నిబంధనల మేరకు ఒకరికి ఒక షాపు మాత్రమే కేటాయిస్తారని జిల్లా ఎక్సైజ్ ఈఎస్ నాగమల్లేశ్వరరెడ్డి చెప్పారు. ఎవరికైనా ఒక్కటి కంటే ఎక్కువ దుకాణాలు వస్తే ఏదో ఒకటి మాత్రమే ఎంపిక చేసుకోవాలన్నారు. రెండేళ్ల కాలానికి లైసెన్సులు మంజూరు చేయనున్నారు.

ఎమ్మెల్యే డ్రైవింగ్.. వెనుక కలెక్టర్



చంద్రగిరి మండలం తొండవాడ ఎన్టీఆర్ కాలనీలో రూ.12.82 కోట్లతో చేపట్టనున్న సీసీ రోడ్డు, అభివృద్ధి పనులకు బుధవారం సాయంత్రం ఎమ్మెల్యే పులివర్తి నాని, కలెక్టర్ వెంకటేశ్వర్ శంకుస్థాపన చేశారు. అనంతరం కలెక్టరును ద్విచక్ర వాహనంపై ఎక్కించుకుని ఎమ్మెల్యే కాలనీ కల్వర్టు పనుల పరిశీలనకు వెళ్లారు.

– చంద్రగిరి, ఆంధ్రజ్యోతి

సీపీఎం మహాసభల కరపత్రాల ఆవిష్కరణ



పాకాల, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): నెల్లూరు వీఆర్ గ్రౌండ్స్‌లో ఫిబ్రవరి 1,2,3 తేదీలలో నిర్వహించనున్న సీపీఎం మహాసభలను జయప్రదం చేయాలని ఆ పార్టీ మండల కార్యదర్శి మధుసూదన్‌రావ్ కోరారు. మహాసభలకు సంబంధించి కరపత్రాన్ని స్థానిక నాయకులతో కలసి బుధవారం ఆయన ఆవిష్కరించారు. సీపీఎం పొలిట్‌బ్యూరో సభ్యులు ఎం.బేబీ, బీవీ రాఘవులు, రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసరావు, రాష్ట్ర నాయకులు పాల్గొనే ఈ సభలకు విశేష సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలన్నారు. పార్టీ నాయకులు రవి, సుగుణమ్మ, కేశవరెడ్డి, నరసమ్మ, మురుగేష్, శేఖర్ పాల్గొన్నారు.

అనారోగ్య బాధితురాలికి ప్రభుత్వ సహాయం అందజేత



బాధితురాలి కుటుంబ సభ్యులకు ముఖ్యమంత్రి సహాయనిధి పత్రాలను అందజేస్తున్న ఎమ్మెల్యే పులివర్తి నాని

తిరుచానూరు, జనవరి 22(ఆంధ్రజ్యోతి): తిరుపతి రూరల్ మండం పాడిపేటకు చెందిన దాక్షాయణి వైద్య ఖర్చులకు ప్రభుత్వం నుంచి సహాయం అందింది. తీవ్ర అనారోగ్యంతో ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న ఈమెకు ఆర్థిక సాయం అందజేయాలని ఎమ్మెల్యే పులివర్తి నానిని బాధితురాలి కుటుంబ సభ్యులు ఇటీవల అభ్యర్థించారు. ఆయన వెంటనే ఈ విషయాన్ని ముఖ్యమంత్రి చంద్రబాబు దృష్టికి తీసుకెళ్లారు. చంద్రబాబు స్పందించారు. రూ.7లక్షలు ముందస్తుగా మంజూరు చేశారు. సీఎం సహాయనిధి నుంచి మంజూరైన రూ.7లక్షలను నేరుగా అపోలో ఆస్పత్రికి పంపించారు. అందుకు సంబంధించిన ధ్రువీకరణ పత్రాలను ఎమ్మెల్యే నాని బుధవారం దాక్షాయని కుటుంబ సభ్యులకు అందజేశారు. ముఖ్యమంత్రి చంద్రబాబుకు రుణపడి ఉంటామని వారు పేర్కొన్నారు.

పశువైద్య శిబిరాలకు విశేష స్పందన



కొత్తవడ్డిపల్లెలో పశువులకు వైద్య పరీక్షలు

పాకాల, జనవరి 22(ఆంధ్రజ్యోతి): గుడివారిపల్లె కొత్తవడ్డిపల్లెలో బుధవారం పశువులకు వైద్య పరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. పాడిపోషణలో తీసుకోవలసిన జాగ్రత్తలు గురించి వివరించారు. ఈ సందర్భంగా జడ్పీటీసీ నంగా పద్మజరెడ్డి మాట్లాడుతూ పశువైద్యశిబిరాలను పాడిరైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. పశువైద్య సహాయ సంచాలకులు డాక్టర్ శ్రీధర్, పశువైద్య అధికారి జి.మోహన్ కుమార్, డాక్టర్ పవన్ కుమార్, సిబ్బంది టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

ఎంబీయూలో పరిశోధక వర్క్‌షాప్ ప్రారంభం



సుందరరాజన్‌ను సన్మానిస్తున్న ఎంబీయే సిబ్బంది

చంద్రగిరి, జనవరి 22(ఆంధ్రజ్యోతి): ఎ.రంగంపేట సమీపంలోని మోహన్‌బాబు విశ్వవిద్యాలయంలో పరిశోధక విద్యార్థులకు రీసెర్చ్ మెథడాలజీ అండ్ పబ్లికేషన్స్ ఎథిక్స్ అనే అంశంపై బుధవారం వర్క్‌షాప్‌ను నిర్వహించారు. సింగపూర్‌లోని నన్యాంగ్ టెక్నలాజికల్ యూనివర్శిటీ విశ్రాంతి ఆచార్యులు సుందరరాజన్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ ఎంత లోతుగా పరిశోధిస్తే అంత గొప్పగా మేధస్సు పెరుగుతుందన్నారు. మైసూర్ జేఎస్ఎస్ సైన్స్ అండ్ టెక్నాలజీ ఆచార్యుడు బీఎస్ మహానంద్ మాట్లాడుతూ విద్యార్థులు ఎంబీయూ లైబ్రరీ సద్వినియోగం చేసుకోంటే ఎన్ని పరిశోధనలైనా చేసుకోవచ్చునన్నారు. ఎంబీయూ రీసెర్చ్ అండ్ ఇన్నోవేషన్ డీన్ అవిరేని శ్రీనివాసులు మాట్లాడుతూ ఎంబీయూ స్థాపించి మూడేళ్లల్లోనే 500 మందికి పైగా పరిశోధక విద్యార్థులు తమ పేర్లను రిజిస్టర్ చేసుకోవడం శుభ పరిణామన్నారు. వర్క్‌షాపు మూడు రోజుల పాటు జరగనుంది. కార్యక్రమంలో డాక్టర్ నాగరాజరామరావ్, వైస్‌ఛాన్స్‌లర్ ప్రొఫెసర్ కరుణాకరన్, రిజిస్ట్రార్ డాక్టర్ సారథి, డీన్లు, ప్రొఫెసర్లు, లెక్చరర్స్ విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.

ఎఫ్ఎల్ఎన్ శిక్షణను సద్వినియోగం చేసుకోవాలి



సమావేశంలో మాట్లాడుతున్న డీఈవో కేవీఎన్‌కుమార్

రామచంద్రాపురరం, జనవరి 22(ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయులు ఫౌండేషన్ లిటరసీ న్యూమరసీ (ఎఫ్ఎల్ఎన్) శిక్షణను సద్వినియోగం చేసుకోవాలని డీఈవో కేవీఎన్ కుమార్ సూచించారు. బుధవారం మెడ్ల ప్రాంతీయ శిక్షణా కేంద్రంలో ఎఫ్ఎల్ఎన్ ట్రైనింగ్‌ను ఆయన తనిఖీ చేశారు.ఈ సందర్భంగా భోజన నాణ్యత, వసతులు, శిక్షణలో బోధిస్తున్న అంశాలపై ఆయన ఆరా తీశారు. టీచింగ్ లెర్నింగ్ మెటీరియల్ పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ శిక్షణలో నేర్చుకున్న అంశాలను ఉపాధ్యాయులు తరగతి గదిలో అన్వయించాలన్నారు. 301మంది ఉపాధ్యాయులు శిక్షణ తీసుకుంటున్నట్లు తెలిపారు. ఏఎంవో శివశంకరయ్య, అసిస్టెంట్ ఏఎంవో మధు, ఎంఈవో భాస్కర్ పాల్గొన్నారు.

డ్రైనేజీకాలువలో వ్యర్థాల తొలగింపు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్



లింగేశ్వరనగర్‌లో చెత్త తొలగింపు పనులు

తిరుపతి రూరల్, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): తిరుపతి రూరల్ మండలం లింగేశ్వరనగర్‌ని ఆనుకుని వెళ్తున్న డ్రైనేజీకాలువ(మజ్జిగకాలువ)లో పేరుకుపోయిన చెత్తను పారిశుద్ధ్య కార్మికులు తొలగించారు. ఆంధ్రజ్యోతిలో మంగళవారం అధ్వాన డ్రైనేజీ వ్యవస్థతో అవస్థలు శీర్షికన ప్రచురితమైన వార్తపై ఎమ్మెల్యే పులివర్తి నాని స్పందించారు. బుధవారం ఆయన గ్రామాల్లో పారిశుద్ధ్య నిర్వహణపై ప్రత్యేక దృష్టిసారించాలని పంచాయతీ అధికారులను ఆదేశించారు. దీంతో సర్పంచ్ ముసుగు కోటేశ్వరరావు నేతృత్వంలో డ్రైనేజీకాలువలో వ్యర్థాల తొలగింపు పనులు చేపట్టారు. పంచాయతీ కార్యదర్శి సుచరిత పాల్గొన్నారు.

చిట్టేడులో జ్వరాలపై ఆరా



ఆరోగ్యకేంద్రంలో రికార్డులను పరిశీలిస్తున్న అడిషనల్ డీఎంఅండ్‌హెచ్‌వో పద్మావతి

కోట, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని చిట్టేడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని బుధవారం అడిషనల్ డీఎం అండ్ హెచ్‌వో పద్మావతి తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించారు. ఆస్పత్రిలోని రోగుల గదులు, ల్యాబ్‌లను పరిశీ లించారు. ఆరోగ్య కేంద్రం పరిధిలోని గ్రామాల్లో జ్వర పీడితులపై ఆరా తీశారు. వైద్యాధికారులు డాక్టర్ వెంకట రమణ, డాక్టర్ నాగరాజు ఆస్పత్రిలో సమస్యలను ఆమె దృష్టికి తీసుకెళ్లారు.

చిరుధాన్యాల ఉత్పత్తుల తయారీపై శిక్షణ

వెంకటగిరి టౌన్, జనవరి 22(ఆంధ్రజ్యోతి): వెంకటగిరిలోని కృషి విజ్ఞాన్ కేంద్రం, అదానీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో చిరుధాన్యాలు, మునగ ఆకు పొడితో బిస్కెట్స్ తయారీపై బుధవారం మహిళలకు శిక్షణ కార్యక్రమం నిర్వహిం చారు. ఈ సందర్భంగా కేవీకే ప్రిన్సిపాల్ శ్రీనివాసరెడ్డి గృహ విజ్ఞాన శాస్త్ర విభాగం ఆధ్వర్యంలో అదానీ ఫౌండేషన్, కృష్ణపట్నం పోర్టు సౌజన్యంతో ఎస్‌హెచ్‌జీ మహిళలకు చిరుధాన్యాల ఉత్పత్తుల తయారీపై శిక్షణ ఇవ్వడం జరిగిందన్నారు. ప్రస్తుతం చిరుధాన్యాలకు డిమాండ్ పెరిగిందని, వాటి ద్వారా తినుబండరాలు తయారు చేసి విక్రయిస్తే లాభసాటిగా ఉంటుంద న్నారు. గృహ విజ్ఞాన శాస్త్రవేత్త విజయశ్రీ, అదానీ ఫౌండేషన్ సభ్యులు సెల్వరాజ్, సాహుల్ పాల్గొన్నారు.

తిరుమలలో టాస్క్‌ఫోర్స్ అధికారుల ఆకస్మిక తనిఖీలు



తిరుమల, జనవరి22(ఆంధ్రజ్యోతి): టీటీడీ టాస్క్‌ఫోర్స్ అధికారులు బుధవారం తిరుమలలో ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఎస్టేట్ ఆఫీసర్ వెంకటేశ్వర్లు సూచనల మేరకు టాస్క్‌ఫోర్స్ ఏఈవో బీ భాస్కర్, ఆర్ యుగంధర్, విజిలెన్స్ సిబ్బందితో కలిసి తిరుమలలోని సీఆర్వో, పీఏసీ1, పీఏసీ2ల వద్ద నున్న ఫాస్ట్‌ఫుడ్ సెంటర్లు, హాకర్‌లైసెన్సులు(తట్టలు), దుకాణాల వద్ద తనిఖీ చేశారు. దుకాణాల లైసెన్సు పత్రాలను పరిశీలించారు. ఈసందర్భంగా ఏఈవో వ్యాపారులతో మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరు టీటీడీ నిబంధనలు తప్పనిసరిగా పాటించాలన్నారు. లైసెన్సు లేకుండా వ్యాపారాలు చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

27న దివ్యాంగుల పింఛన్ల పరిశీలన

భాకరాపేట, జనవరి 22(ఆంధ్రజ్యోతి): చిన్నగొట్టిగల్లు మండలంలో దివ్యాంగుల పింఛన్లను ఈనెల 27న పరిశీలించనున్నట్లు ఎంపీడీవో గిడ్డయ్య తెలిపారు. ప్రభుత్వం మూడు రకాల వికలాంగ పింఛన్లు పంపిణీ చేస్తోందన్నారు. ఈ క్రమంలో మొదటగా మంచానికి పరిమితమై రూ.15 వేలు తీసుకుంటున్న వారి ఇళ్లకు వెళ్లి పరిశీలించనున్నారు. నెల్లూరు జీజీహెచ్‌కు చెందిన వైద్యులు సురేంద్ర, ప్రసాద్, డిజిటల్ అసిస్టెంట్ శరత్‌బాబు, భాకరాపేట పీహెచ్‌సీ వైద్యాధికారి తేజస్విని ఈ బృందంలో ఉంటారు. 29 మందిని పరిశీలిస్తారు. ఇందుకు అధికారులకు సహకరించాలని ఆయన లబ్ధిదారులను కోరారు.

అధ్వానంగా మరుగుదొడ్లు



మరుగుదొడ్లలో విరిగిన పైపులు

తిరుపతి(ఆర్టీసీ), జనవరి 22(ఆంధ్రజ్యోతి): సెంట్రల్ బస్టాండులో మరుగుదొడ్లు అధ్వానంగా ఉన్నాయి. ప్రయాణికుల సౌకర్యార్థం బెంగళూరు, వెంకటగిరి పాయింట్స్ వద్ద ఏర్పాటు చేసిన ఉచిత టాయిలెట్లకు పైకప్పులేదు. పైపులు విరిగిపోయాయి. నీరు సరిగా రావడం లేదు. అపరిశుభ్రతతో దుర్వాసన వెదజల్లుతున్నాయి. లోనికి వెళ్లడానికి భయపడే పరిస్థితి ఉంది. అధికారులు స్పందించాల్సిన అవసరముంది.

పింఛన్ల తనిఖీ

పిచ్చాటూరు, జనవరి 22(ఆంధ్రజ్యోతి): దివ్యాంగుల పింఛన్లలో అనర్హులను గుర్తించడానికి ప్రభుత్వం దృష్టి సారించింది. ఇందులో భాగంగా బుధవారం ఎంపీడీవో మహ్మద్‌రఫి ఆధ్వర్యంలో నెల్లూరు ప్రభుత్వ జనరల్ ఆస్పత్రి అసిస్టెంట్ ప్రొఫెసర్లు ఎం.వెంకట్ హరిప్రసాద్, డాక్టర్ రేణుకాదేవి, మండల వైద్యాధికారి హమీద్, వెలుగు సమాఖ్య బృందం మండలంలోని ఇంటి ఇంటికీ వెళ్లి దివ్యాంగులకు వైద్య పరీక్షలు నిర్వహించారు.

నత్తనడకన రైల్వే బైపాస్ మార్గం పనులు



రేణిగుంట-తిరుపతి రైలు మార్గంలో అర్ధంతరంగా నిలిచిపోయిన అండర్ బ్రిడ్జి నిర్మాణం

తిరుపతి(సెంట్రల్), జనవరి 22 (ఆంధ్రజ్యోతి): రేణిగుంట సంతగేటువద్ద చెన్నై-తిరుపతి బైపాస్ రైలు మార్గం నిర్మాణ పనులు నత్తకన సాగుతున్నాయి. ఈ రైలు మార్గం నిర్మాణానికి రైల్వే అధికారులు పూర్తిస్థాయి సహకారాన్ని అందించినా రెవెన్యూ అధికారులు సరిగా స్పందించడలేదనే విమర్శలున్నాయి. భూసేకరణలో భాగంగా ఇప్పటికీ కొన్ని ఇళ్లను తొలగించాల్సి ఉంది. బైపాస్ మార్గం నిర్మించే కాంట్రాక్టర్లు మాత్రం పనులు ప్రారంభించకుండా కాలయాపన చేస్తున్నారు. 2023 ఏప్రిల్‌లో దక్షిణ మధ్య రైల్వే అధికారులు రేణిగుంట రైల్వే స్టేషన్‌పై రైళ్ల రద్దీ తగ్గించి, సమయాన్ని ఆదా చేయడానికి ఈ బైపాస్ మార్గం పనులను ప్రారంభించారు. ఇందుకుగాను రైల్వేశాఖ రూ.22 కోట్లు మంజూరు చేసింది. ఇందులో భూసేకరణకు రూ.4.30 కోట్లు, రైలు మార్గం నిర్మాణానికి మిగిలిన నిధులను కేటాయించారు. గత ఏడాది నుంచి నిర్మాణ పనులు జరుగుతూనే ఉన్నాయి. భూసేకరణలో రెవెన్యూ అధికారులు ఆరంభంలో చూపిన చొరవ తర్వాత చూపలేదు. 53 నివాస గృహాలకుగాను ఇప్పటికి 70 శాతం తొలగించారు. మిగిలిన గృహాలను తొలగించే పనిలో ఉన్నారు. కాంట్రాక్టర్లు మాత్రం నిర్మాణ పనులు ప్రారంభించలేదు. నెల క్రితం కురిసిన వర్షాల సమయంలో అండర్ బ్రిడ్జి పనులు సగం పూర్తిచేశారు. బ్రిడ్జి పైన కాంక్రీట్ స్లాబ్ వేసి రైలు మార్గం పనులు చేపట్టాలి. అండర్ బ్రిడ్జి పనులు పూర్తి చేస్తే సుమారు పది కాలనీల ప్రజలు టౌన్‌లోకి రాకపోకలు సాగించుకోవడానికి వీలుంటుంది.

తొండవాడలో అభివృద్ధి పనులకు శ్రీకారం



అభివృద్ధి పనుల శిలాఫలకం వద్ద కలెక్టర్ వెంకటేశ్వర్, ఎమ్మెల్యే పులివర్తి నాని,తదితరులు

చంద్రగిరి, జనవరి 23(ఆంధ్రజ్యోతి): తొండవాడ ఎన్టీఆర్ కాలనీలో బుధవారం సాయంత్రం సీసీ రోడ్డు, అభివృద్ధి పనులకు జిల్లా కలెక్టర్ వెంకటేశ్వర్, ఎమ్మెల్యే పులివర్తి నాని శంకుస్థాపన చేశారు. రూ.12.82 కోట్లతో 35 అభివృద్ధి కార్యక్రమాలకు శ్రీకారం చుట్టారు. ఎమ్మెల్యే నాని స్వయంగా రోడ్డు రోలర్ వాహనాన్ని నడిపి పనులను ప్రారంభించారు. తర్వాత కాలనీలో కల్వర్టు పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వం మాదిరిగా తమది మాటలతో కాలయాపన చేసే ప్రభుత్వం కాదన్నారు. తమది ప్రభుత్వం చేతల ప్రభుత్వన్నారు. ఎన్టీఆర్ కాలనీకి ఎన్టీఆర్ పంచాయతీగా పేరు పెట్టాలని స్థానికులు కలెక్టర్‌ను కోరారు. అంగన్వాడీ భవనం, ప్రాథమిక పాఠశాల ఏర్పాటు చేయాలని ఎమ్మెల్యే నాని కోరడంతో కలెక్టర్ సానుకూలంగా స్పందించారు. కాలనీలో సోలార్ విద్యుత్ వ్యవస్థ ఏర్పాటుపై ప్రజలకు అవగాహన కల్పించాలని విద్యుత్ శాఖ అధికారులకు ఆదేశించారు. జిల్లా స్థాయి అధికారులు, నాయకులు, పాల్గొన్నారు.

హైలెవల్ వంతెన నిర్మాణానికి ప్రతిపాదనలు సిద్ధం చేయండి



వంతెన పరిశీలిస్తున్న కలెక్టర్ వెంకటేశ్వర్

ఏర్పేడు, జనవరి 22(ఆంధ్రజ్యోతి): మండలంలోని గోవిందవరం - మునగలపాళెం మధ్య స్వర్ణముఖి లోలెవల్ వంతెనపై యేటా వర్షాకాలంలో సుమారు 20 రోజుల పాటు ఉధృతంగా నీరు ప్రవహిస్తుంది. దీంతో చుట్టుపక్కల గ్రామాలకు రాకపోకలు స్తంభిస్తుంటాయి. దీనిపై చుట్టుపక్కల గ్రామస్తులు ఎమ్మెల్యే సుధీర్ దృష్టికి తీసుకెళ్లారు. ఈ క్రమంలో సమస్యను కలెక్టర్ వెంకటేశ్వర్‌కు ఎమ్మెల్యే విన్నవించారు. దీంతో బుధవారం గోవిందవరం వద్ద స్వర్ణముఖి నదిపై లోలెవల్ వంతెనను కలెక్టర్ పరిశీలించారు. హైలెవల్ వంతెన అంచనాలు, ప్రతిపాదనలు సిద్ధం చేసి పంపాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో శ్రీకాళహస్తి ఆర్డీవో భానుప్రకాష్‌రెడ్డి, టీడీపీ నాయకులు ధనంజయులునాయుడు, నాగరాజునాయుడు, చిరంజీవులునాయుడు పాల్గొన్నారు.

ఎస్ఐ భౌతికకాయానికి ఎమ్మెల్యే నివాళి



పిచ్చాటూరు, జనవరి 22(ఆంధ్రజ్యోతి): అనారోగ్యంతో మరణించిన పిచ్చాటూరువాసి ఊత్తుకోట ఎస్ఐ రాజేంద్రన్ భౌతికకాయానికి ఎమ్మెల్యే ఆదిమూలం నివాళులర్పించారు. రాజేంద్రన్ స్వగృహానికి చేరుకుని నివాళులర్పించిన అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించారు. అలాగే ఎస్ఐ రాజేంద్రన్‌కు తమిళనాడు పోలీసులు ఘన నివాళులర్పించారు. సాయంత్రం తమిళనాడు డీఎస్పీ శాంతి ఆధ్వర్యంలో సీఐ దేవరాజ్, ఎస్ఐ ప్రసన్న వరదన్‌లతో కలసి భారీగా పోలీసులు పిచ్చాటూరుకు చేరుకుని గజమాలతో అశ్రునివాళులర్పించారు.

తృటిలో తప్పిన బస్సు ప్రమాదం

వెదురుకుప్పం, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): తృటిలో బస్సు ప్రమాదం తప్పడంతో ప్రయాణీకులు ఊపిరి పీల్చుకున్నారు. ఈ ఘటనలో బుధవారం వెదురుకుప్పం మండలంలో జరిగింది. తిరుపతి ఆర్టీసీ డిపోకు చెందిన బస్సు ఎస్ఆర్‌పురం నుంచి కార్వేటినగరం, వెదురుకుప్పం మండలం పచ్చికాపల్లం మీదుగా తిరుపతి వెళ్తోంది. ఈ క్రమంలో ఎస్ఆర్‌పురం నుంచి వెదురుకుప్పం మండలం గెరిగిదొన సమీపానికి వచ్చే సరికి రోడ్డు పక్కకు వెళ్లడంతో కేబుల్ కోసం తీసిన గొయ్యిలో మట్టి ఉన్నప్పటికీ దిగబడిపోవడంతో బస్సు ఒరిగిపోయింది. దీంతో భయాందోళనకు గురైన ప్రయాణీకులు ప్రాణ భయంతో కేకలు, అరుపులతో దిగిపోయరని స్థానికులు తెలిపారు. బస్సు బోల్తా పడకపోవడంతో ప్రయాణీకులు ఊపిరి పీల్చుకున్నారు. త్రుటిలో ప్రమాదం తప్పింది.

నకిలీ బంగారం ముఠా అరెస్ట్

- రూ.21 లక్షల నగదు, 5 ద్విచక్రవాహనాలు, 5 సెల్‌ఫోన్లు స్వాధీనం



నకిలీ బంగారాన్ని చూపిస్తున్న డీఎస్పీ వెంకటేశ్వర్లు

సోమందేపల్లి, జనవరి 22(ఆంధ్రజ్యోతి): నకిలీ బంగారం హారాలు చూపి ప్రజలను మోసం చేసి డబ్బులతో ఉడాయించే ముఠా సభ్యులను పోలీసులు అరెస్ట్ చేశారు. శ్రీసత్యసాయి జిల్లా సోమందేపల్లి పోలీస్‌స్టేషన్‌లో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో డీఎస్పీ వెంకటేశ్వర్లు వివరాలను వెల్లడించారు. ఎక్స్‌కవేటర్‌తో పొలాలను దున్నుతుంటే పాతకాలంనాటి బంగారం హారాలు లభ్యమయ్యాయని నమ్మబలికి.. వాటిని తక్కువ ధరకే ఇస్తామని ఆశచూపి మోసం చేశారని తెలిపారు. హిందూపురం నుంచి పెనుకొండ వైపు వస్తున్నారని తెలిసి దారికాశామని అన్నారు. 10 మంది ముఠా సభ్యులు దోచుకున్న సొమ్మును పంచుకుంటుండగా వలపన్ని పట్టుకున్నామని తెలిపారు. అదుపులోకి తీసుకుని విచారిస్తే నేరాన్ని ఒప్పుకున్నట్లు వెల్లడించారు. దీనిపై కుప్పం మండలం పైపాళ్యంలో వెంకటేష్, విడపనకల్లుకు చెందిన ఈరన్న అనే వ్యక్తులు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. వీరిని సోమందేపల్లి మండలం బ్రాహ్మణపల్లి వద్దకు పిలిపించి, మాటల్లో మభ్యపెట్టి వారి వద్ద నుంచి నగదు తీసుకుని ఉడాయించారని పేర్కొన్నారు. ఈ మేరకు సోమందేపల్లి పోలీసులకు బాధితులు ఫిర్యాదు చేశారని అన్నారు. రెండు కేసుల్లో రూ.24 లక్షలు కాజేసినట్లు వివరించారు. నకిలీ హారాలతో మోసం చేసిన నిందితులు రాణా కిష్టబాబు, ఏఆర్ శాంతరాజు, నయాజ్ అహ్మద్, ఎం. ఈరన్న, బాబు, షికారి అర్జున్, గోవిందుల ఆనంద్ బాబు, సోమాల్‌బంగారి, ఈడిగ హరిప్రసాద్, పిచ్చిగుంట్ల మారెప్పను అరెస్ట్ చేసి కేసు నమోదుచేసినట్లు తెలిపారు. వారి వద్ద నుంచి రూ.21 లక్షల నగదు, ఐదు బైక్‌లు, ఐదు సెల్ ఫోన్లను స్వాధీనంచేసుకున్నట్లు పేర్కొన్నారు

ముగిసిన కానిస్టేబుల్ అభ్యర్థుల ఎంపిక ప్రక్రియ



పరుగుపందెంలో పాల్గొన్న అభ్యర్థులు - ఛాతీ కొలతను పరిశీలిస్తున్న ఎస్పీ మణికంఠ చందోలు

చిత్తూరు అర్బన్, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): గత 22 రోజులుగా జరిగిన పోలీసు కానిస్టేబుల్ అభ్యర్థుల దేహదారుఢ్య, సామర్థ్య పరీక్షలు బుధవారంతో ముగిశాయి. ఎస్పీ మణికంఠ చందోలు ప్రత్యేక పర్యవేక్షణలో ఎంపిక ప్రక్రియ జరిగింది. మొత్తం 5238 మంది అభ్యర్థులు హాజరుకావాల్సి ఉండగా.. 3799 మంది హాజరయ్యారు. వీరిలో 1683 మంది రాతపరీక్షకు అర్హత సాధించారు. అత్యాధునిక సాంకేతిక పరికరాల సహాయంతో, ఏపీ స్టేట్ లెవల్ రిక్రూట్‌మెంట్ బోర్డు నియమ నిబంధనల మేరకు 25 సీసీ కెమెరాల పర్యవేక్షణలో ఎంపిక ప్రక్రియ జరిగింది. ఈ పరీక్షలు ప్రతి రోజు ఉదయం 5 గంటలకు ప్రారంభమై సాయంత్రం వరకు కొనసాగాయి. ఎంపిక ప్రక్రియలో ఎలాంటి పొరబాట్లు జరగకుండా నిర్వహించిన సిబ్బందిని ఈ సందర్భంగా ఎస్పీ ప్రత్యేకంగా అభినందించారు.

వైసీపీ నేతలకు పెద్దిరెడ్డి పరామర్శ



భాకరాపేట, జనవరి 22(ఆంధ్రజ్యోతి): చిన్నగొట్టిగల్లు మండలంలోని పలువురు వైసీపీ నేతలను మాజీమంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి బుధవారం పరామర్శించారు. మాతృ వియోగంతో బాధ పడుతున్న మండల పార్టీ అధ్యక్షుడు కొండారెడ్డిని, తండ్రిని కోల్పోయిన కోడేకంభంవారిపల్లెకు చెందిన మాజీ సర్పంచ్ భాస్కరరెడ్డి, రఘునాథరెడ్డిలను పరామర్శించారు. ఆయన వెంట ఎంపీపీ యుగంధర్ రెడ్డి, మాజీ ఎమ్మెల్సీ శ్రీనివాస రెడ్డి, ఎంఆర్‌సీ రెడ్డి, సహదేవరెడ్డి, తదితరులు ఉన్నారు.

దివంగత అటవీశాఖాధికారి ఫ్యామిలీ పెన్షన్‌లో రికవరీ

పుత్తూరు, జనవరి 22(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వానికి ఆర్థిక పరమైన నష్టం కలిగించిన దివంగత పుత్తూరు ఫారెస్ట్ అధికారి సుబ్రహ్మణ్యం మీద చర్యలు తీసుకోవాలని ఆదేశిస్తూ బుధవారం ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. గతంలో పుత్తూరు అటవీశాఖాధికారిగా పనిచేస్తూ ఆయన పదవీ విరమణ తర్వాత రెండేళ్ల క్రితం మరణించారు. ప్రస్తుతం ఆయన వారసులు పెన్షన్‌ను పొందుతున్నారు. ఈ క్రమంలో గతంలో ఆయన మీద నమోదైన దాదాపు 12 కేసుల పూర్వాపరాలను పరిశీలించిన రాష్ట్రప్ర భుత్వ ప్రత్యేక అధికారి అనంతరాము ఈ మేరకు ఉత్తర్వులను జారీ చేశారు. ఆయన ఫ్యామిలీ పెన్షన్ నుంచి ప్రభుత్వ నష్టాన్ని వసూలు చేయాలని జిల్లా అటవీశాఖాధి కారులను ఆదేశించారు.

నేడు దుండి వినాయకస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు

నారాయణవనం, జనవరి 22(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని దుండి వినాయక స్వామి ఆలయంలో రాష్ట్ర విద్యా శాఖ మంత్రి లోకేశ్ జన్మదినం సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నట్లు జడ్పీటీసీ సభ్యుడు సుమన్ కుమార్ తెలిపారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే ఆదిమూలం ముఖ్య అతిథిగా హాజరవుతారని చెప్పారు.

26న రాష్ట్ర స్థాయి క్విజ్, వ్యాసరచన పోటీలు

గొల్లపూడి, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): ఎన్టీఆర్ జిల్లా గొల్లపూడిలోని ఎస్‌పీఎస్ఆర్‌సీ ప్రభుత్వ జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఈనెల 26న 6వ తరగతి నుంచి టెన్త్ విద్యార్థులకు వడ్లమూడి బ్రదర్స్ ఛారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో మేధ 2025 పేరుతో క్విజ్, వ్యాసరచన, కథల పోటీలు నిర్వహించనున్నట్లు ట్రస్టు మేనేజింగ్ ట్రస్టీ వడ్లమూడి రామకృష్ణ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. పోటీల్లో విజేతలకు బహుమతులు అందిస్తామన్నారు. ఒక పాఠశాల నుంచి ముగ్గురితో కలిసి ఉన్న ఒక టీమ్ మాత్రమే పోటీల్లో పాల్గొనాలన్నారు. ఈ నెల 24 సాయంత్రం 5 గంటల లోపు ఆయా పాఠశాలలకు చెందిన ఉపాధ్యాయులు విద్యార్థుల పేర్లు నమోదు చేయించుకోవాలన్నారు. పూర్తి వివరాలకు 9490336550ను సంప్రదించాలన్నారు.

ద్రావిడ వర్సిటీలో న్యాక్ కమిటీ

గుడుపల్లె, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): ద్రావిడ విశ్వవిద్యాలయానికి బుధవారం న్యాక్ కమిటీ వచ్చింది. వీసీ దొరస్వామి, రిజిస్ట్రార్ కిరణ్ కుమార్ న్యాక్ కమిటీ సభ్యులకు స్వాగతం పలికారు. అనంతరం పరిపాలనా భవనంలో వీసీ, రిజిస్ట్రార్, ఇతర అధికారులతో న్యాక్ కమిటీ సభ్యులు సమావేశమయ్యారు. తరువాత విశ్వవిద్యాలయంలోని శాఖలను సందర్శించి అధ్యాపకుల , విద్యార్థుల వివరాలను తెలుసుకొన్నారు.శాఖాధిపతులు వారివారి శాఖల ప్రగతిని పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా న్యాక్ కమిటీకి వివరించారు. అనంతరం సమావేశపు హాల్లో విద్యార్థులతో న్యాక్ కమిటీ సమావేశమైంది. ద్రావిడ వర్సిటీలోని కేంద్రీయ గ్రంథాలయాన్ని న్యాక్ కమిటీ సభ్యులు సందర్శించారు. తరువాత న్యాక్ కమిటీ సభ్యులు విశ్వవిద్యాలయంలోని బోధనేతర సిబ్బందితో సమావేశమయ్యారు.సాయంత్రం అధ్యాపకులతో సమావేశమై వివరాలను తెలుసుకొన్నారు. రాత్రి విశ్వవిద్యాలయం ఓపెన్ ఆడిటోరియంలో విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలను న్యాక్ కమిటీ బృందం తిలకించింది.

కొత్త ప్రతిపాదనలు అమలైతే హ్యాపీజర్నీ



తిరుపతి(ఆర్టీసీ), జనవరి 22 (ఆంధ్రజ్యోతి): తిరుపతి, తిరుమలలో ప్రయాణికులను ఎప్పటికప్పుడు గమ్యస్థానాలకు చేర్చేందుకు ఆర్టీసీ అధికార యంత్రాంగం కొన్ని చర్యలు తీసుకోనుంది. కాలం చెల్లిన పాత విధానాలకు స్వస్తి పలకాలని సంకల్పించింది. ఈ క్రమంలో ఇన్‌చార్జ్ డీపీటీవో జి.నరసింహులు కొన్ని ప్రతిపాదనలను సిద్ధం చేశారు. అధికారులు, యూనియన్ నాయకులు, గ్యారేజీ సిబ్బందికి వాటిని వివరించి ఏకాభిప్రాయంతో అమలు చేయాలని భావిస్తున్నారు. ఆర్టీసీకి ఆదాయంతోపాటు భక్తులకు వీటితో సౌకర్యంగా ఉంటుందని చెబుతున్నారు.

ఇవీ ప్రతిపాదనలు..

- తిరుమలలో ఇష్టానుసారం పార్క్‌చేస్తున్న శ్రీకాళహస్తి, పుత్తూరుడిపోల బస్సులను రాంభగీచ బస్టాండుకు తరలించాలి.
- కాలుష్యరహిత ఎలక్ట్రిక్ బస్సులను తిరుమల రింగురోడ్డు మీదుగా వరాహస్వామి రెస్ట్‌హౌస్ ముందు ఆపి భక్తులను ఎక్కించుకోవాలి.
- బాలాజీ, రాంభగీచ, వరాహస్వామి బస్టాండుల వద్ద బారులు తీరే బస్సులను కంట్రోలర్స్ సమన్వయం చేసుకుని రద్దీ ప్రాంతానికి తరలించాలి.
- అలిపిరి లింకుబస్టాండు వద్ద త్వరగాబస్సులనుక్లియర్ చేయాలి.
- రైల్వేస్టేషన్ వద్ద అలిపిరి నడక మార్గాల భక్తులను ఎక్కించుకోవాలి. ఇందుకు రూ.20 చార్జీలు వసూలు చేయాలి.
- ఎలక్ట్రిక్ బస్సుల్లో రిటర్న్ టిక్కెట్ జారీ చేయాలి.
- సెంట్రల్ బస్టాండులో ఎక్కడపడితే అక్కడ ఆపి భక్తులను ఎక్కించకుండా ఏడుకొండల బస్టాండు ఇరువైపులా క్రమపద్ధతిలో బస్సులు ఆపి ఎక్కించాలి.
- తిరుమల డిపో పరిధిలోని చెన్నై సర్వీసులను మంగళం డిపోకు మార్చాలి. మంగళండిపో బస్సులకు తిరుపతి, తిరుమలలో ప్లాట్‌ఫామ్ కేటాయించాలి.
- రద్దయిన చెన్నై సర్వీసులను తిరుమల నుంచి నేరుగా తిరుచానూరుకు పొడిగించాలి.
- తిరుపతి-శ్రీకాళహస్తి మార్గంలో మెట్రో బస్సుల స్థానంలో సూపర్ లగ్జరీ, అల్ట్రాడీలెక్స్, ఎక్స్‌ప్రెస్ బస్సులను కేటాయించాలి.
- తిరువణ్ణామలైకి సర్వీసులను పెంచాలి.
- పర్వదినాలు, వరుస సెలవులను ముందుగానే గుర్తించి అదనపు బస్సులను నడపాలి.
- తిరుచానూరుకు మంగళం డిపో బస్సులను రద్దు చేసి ఇతర గ్రామాలకు తరలించాలి.

సమన్వయ కమిటీ ఏర్పాటు చేయండి

నగర అభివృద్ధికి నిధులు మంజూరు చేయిస్తా - కార్పొరేషన్, తుడా సమీక్షలో ఎమ్మెల్యే ఆరణి



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే శ్రీనివాసులు

తిరుపతి, జనవరి 22 (ఆంధ్రజ్యోతి) : తిరుపతి అభివృద్ధిపై సమన్వయ కమిటీ (టాస్క్‌ఫోర్స్) ఏర్పాటు చేసుకుని, నెలలో ఒక రోజు సమీక్షిస్తే బాగుంటుందని ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు అధికారులకు సూచించారు. గత టీడీపీ ప్రభుత్వంలో టీటీడీ, పోలీస్, కార్పొరేషన్, తుడా, స్థానిక ప్రజాప్రతినిధులతో టాస్క్‌ఫోర్స్ ఉండేదని, వైసీపీ ప్రభుత్వం వచ్చిన తర్వాత దాన్ని పక్కన పెట్టేసిందని విమర్శించారు. బుధవారం స్మార్ట్ సిటీ, తుడాపై మున్సిపల్ కార్యాలయంలో ఎమ్మెల్యే అధ్యక్షతన సమీక్ష జరిగింది. తిరుపతి అభివృద్ధికి ఎన్డీఏ ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇస్తోందన్నారు. స్మార్ట్ సిటీ పనుల పూర్తికి రాష్ట్ర వాటా కింద రావాల్సిన రూ.209 కోట్లను వీలైనంత త్వరగా ప్రభుత్వం అందిస్తుందని తెలిపారు. నగరంలో 19 స్మార్ట్ సిటీ పనులు పెండింగ్‌లో ఉండగా వీటి పూర్తికి రూ.450 కోట్లు అవసరమని అధికారులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకొచ్చారు. తక్షణం రూ.25 కోట్లు మంజూరు చేస్తే పెండింగ్ పనులు పూర్తవుతాయని అధికారులు తెలిపారు. సీఎం, డిప్యూటీ సీఎంల చొరవతో త్వరలో శెట్టిపల్లి భూ సమస్య పరిష్కారమవుతుందని ఎమ్మెల్యే వెల్లడించారు. గత ప్రభుత్వం శెట్టిపల్లి అభివృద్ధిని కార్పొరేషన్‌తో భాగస్వామ్యం చేసిందని, దాన్ని రద్దు చేసి తిరిగి తుడా పరిధిలోకి తీసుకొస్తామని చెప్పారు. తుడా టవర్స్‌ను త్వరగా పూర్తి చేయాలని ఆదేశించారు. ఈ సమావేశంలో కమిషనర్, తుడా వీసీ ఎన్.మౌర్య, తుడ సెక్రటరీ వెంకటనారాయణ, ఎస్ఈలు కృష్ణారెడ్డి, శ్యాంసుందర్, స్మార్ట్ సిటీ జీఎం చంద్రమౌళి, ఈఈ చంద్రశేఖర్, కార్పొరేషన్, తుడా అధికారులు పాల్గొన్నారు.

చెత్త బుట్టలు వినియోగించండి



రైతు బజార్‌ను పరిశీలిస్తున్న కమిషనర్ మౌర్య

తిరుపతి, జనవరి 22 (ఆంధ్రజ్యోతి) : నగరపాలక సంస్థ పరిధిలోని అన్ని దుకాణ, వాణిజ్య సముదాయాల్లో, గృహాల్లో తప్పకుండా చెత్త బుట్టలు వినియోగించాలని నగరపాలక సంస్థ కమిషనర్ ఎన్. మౌర్య అన్నారు. నగరంలోని రాయల్ నగర్, మారుతీ నగర్, రైతు బజారు, ఎమ్మార్ పల్లి కూడలి, వెస్ట్ చర్చి తదితర ప్రాంతాల్లో బుధవారం ఆమె తనిఖీలు నిర్వహించారు. పలు దుకాణాల వద్ద చెత్త రోడ్లపైనే వేస్తుండడం చూసి మందలించారు. కమిషనర్ మాట్లాడుతూ పలువురు దుకాణదారులు చెత్త బుట్టలు వినియోగించకుండా చెత్తను కవర్లలో కాలువల్లో పడేస్తున్నారని, తద్వారా చెత్త పేరుకుపోయి మురుగు నీరు రోడ్లపైకి వచ్చి అపరిశుభ్రంగా తయారవుతున్నాయని చెప్పారు. ప్రతి ఒక్కరూ పరిశుభ్రతకు సహకరించాలని అన్నారు. రాయల్‌నగర్‌లోని తుడా పార్కును పరిశీలించి శుభ్రంగా ఉంచాలని, ఆట పరికరాలు మరమ్మతులు చేయించాలని ఆదేశించారు. కమిషనర్ వెంట ఎస్ఈ శ్యాంసుందర్, ఎంహెచ్‌వో డాక్టర్ యువ అన్వేష్, తుడా ఈఈ రవీంద్ర, డీఈలు ఏసీపీ బాలాజీ, సర్వేయర్ కోటేశ్వరరావు, శ్రీనాథ్ రెడ్డి, శానిటరీ సూపర్ వైజర్ చెంచయ్య ఉన్నారు.

పంట కాలువ కబ్జాపై పరిశీలన



కాలువను పరిశీలిస్తున్న సర్వే డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ చిట్టిబాబు, గ్రామస్తులు

తిరుపతి అర్బన్, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): 150 ఎకరాలకు నీటిని అందిస్తున్న పంట కాలువ కబ్జాకు గురైందన్న ఫిర్యాదుపై కలెక్టర్ వెంకటేశ్వర్ స్పందించారు. ఆయన ఆదేశాలతో తిరుపతి డివిజన్ సర్వే డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ చిట్టిబాబు బుధవారం ఆ కాలువను పరిశీలించారు. తిరుపతి అర్బన్ మండలం శెట్టిపల్లి గ్రామ పరిధిలోని అన్నాచెరువు నుంచి చెన్నాయగుంట గ్రామంలోని మంచినీళ్లగుంట వరకు ఉన్న కాలువ ద్వారా 150 ఎకరాలకు సాగునీరు అందుతోందని, దాన్ని రియల్ ఎస్టేట్ వ్యాపారులు కబ్జా చేస్తున్నారని గ్రామస్తులు నవంబర్ 25వ తేదీ జరిగిన పీజీఆర్ఎస్‌లో కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. ఆయన ఆదేశాల మేరకు తిరుపతి డివిజన్ సర్వే డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ చిట్టిబాబు బుధవారం గ్రామస్తులతో కలసి పంటకాలువ హద్దులను తనిఖీ చేశారు. కాలువ కొంతమేరకు కబ్జాకు గురైనట్లు నిర్ధారణకు వచ్చారు. జేసీకి నివేదిక అందజేస్తామని చెప్పారు. సర్వేయర్ జగదీష్, అర్జీదారుడు సుబ్రహ్మణ్యం, గ్రామస్తులు వై.నాగరాజు, వెంకటయ్య, రవి, వై.మునికృష్ణ, కృష్ణయ్య, రామకృష్ణ పాల్గొన్నారు.

కరాటే కుందనకు అవార్డు



అవార్డు అందుకుంటున్న కుందన

తిరుపతి(క్రీడలు), జనవరి 22 (ఆంధ్రజ్యోతి): స్థానిక కరాటే క్రీడాకారిణి పి.కుందనకు హైదరాబాదుకు చెందిన మాస్టర్ కేశవ్ కరాటే అకాడమీ మంగళవారం ఇంటర్నేషనల్ రైజింగ్‌స్టార్ మార్షల్ ఆర్ట్స్ పురస్కార్ అవార్డును ప్రదానం చేసింది. న్యూ ఇందిరానగర్‌కు చెందిన కుందన జాతీయ, అంతర్జాతీయంగా 11 కరాటే(కుమితే, కట విభాగాలు) చాంపియన్‌షిప్ పోటీలలో పాల్గొంది. అన్నింటిలోనూ బంగారు పతకాలు కైవసం చేసుకుంది. ఆమె ప్రతిభను గుర్తించిన కేశవ్‌కరాటే అకాడమీ సంస్థ ఈ మేరకు పురస్కారం ప్రదానం చేసి, ఘనంగా సత్కరించింది. బాలికను పలువురు అభినందించారు.

31నుంచి తైక్వాండో పోటీలు



పోస్టర్ ఆవిష్కరిస్తున్న రవినాయుడు

తిరుపతి(క్రీడలు), జనవరి 22(ఆంధ్రజ్యోతి): కాకినాడలోని జేఎన్టీయూకే ఇండోర్ స్టేడియంలో ఈ నెల 31 నుంచి మూడు రోజుల పాటు ఎన్టీఆర్ మెమోరియల్ ఏపీ స్టేట్ తైక్వాండో చాంపియన్‌షిప్ పోటీలు నిర్వహించనున్నారు. దీనికి సంబంధించిన పోస్టర్‌ను శాప్ చైర్మన్ ఎ.రవినాయుడు బుధవారం శ్రీనివాస క్రీడా సముదాయంలో ఆవిష్కరించారు. కార్యక్రమంలో తిరుపతి, చిత్తూరు డీఎస్‌డీవోలు సయ్యద్‌సాహెబ్, బాలాజీ, చిత్తూరు జిల్లా తైక్వాండో అసోసియేషన్ ప్రతినిధులు మనోహర్, రమణ, శీను, లోకేశ్ తదితరులు పాల్గొన్నారు.

సకాలంలో గుర్తిస్తే కుష్ఠును నివారించవచ్చు



రికార్డులను పరిశీలిస్తున్న శ్రీనివాసులరెడ్డి

తిరుపతి (వైద్యం), జనవరి 22 (ఆంధ్రజ్యోతి): కుష్ఠు వ్యాధిని మొదట్లోనే గుర్తిస్తే సులువుగా నివారించవచ్చునని, ఆ దిశగా వైద్య సిబ్బంది కృషి చేయాలని జిల్లా కుష్ఠు, క్షయ నివారణ అధికారి శ్రీనివాసులరెడ్డి పేర్కొన్నారు. బైరాగిపట్టెడలోని అర్బన్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆయన బుధవారం తనిఖీ చేశారు. కుష్ఠు వివరాలను తెలుసుకున్నారు. రికార్డులను పరిశీలించారు. వ్యాధి లక్షణాలైన స్పర్శ లేని మచ్చలు, పొడలు, నొప్పిలేని పుండ్లు వంటి వాటిపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. వ్యాధిగ్రస్తులకు ప్రభుత్వం ఖరీదైన మందులు, శస్త్ర చికిత్స అందిస్తుందన్నారు. కార్యక్రమంలో మెడికల్ ఆఫీసర్ డాక్టర్ శ్రేష్ఠ, సిబ్బంది వెంకటరమణ, కిరణ్‌కుమార్ పాల్గొన్నారు.

గాయపడిన కళాకారుడిని ఆదుకోండి



రుయాలో చికిత్స పొందుతున్న నర్సింగ్

తిరుపతి(నేరవిభాగం), జనవరి 22 (ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో గాయపడి రుయాలో చికిత్స పొందుతున్న కళాకారుడిని ఆదుకోవాలని పలువురు కళాకారులు కోరుతున్నారు. తిరుపతికి చెందిన ఆర్.నర్సింగ్ టీటీడీ ధర్మప్రచార పరిషత్ ఆధ్వర్యంలో వయోలిన్ కళాకారుడిగా పనిచేస్తున్నాడు. ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డాడు. చేయి విరగడంతో రుయా ఆర్థోపెడిక్ వార్డులో చికిత్స పొందుతున్నాడు. పేదవాడు కావడం, మూడు నెలలుగా జీతం రాకపోవడంతో కనీసం మందులు కొనుగోలు చేయడానికి కూడా డబ్బు లేదని, దాతలు ఎవరైనా ఆర్థిక సాయం చేసి ఆదుకోవాలని తోటి కళాకారులు కోరుతున్నారు.

వెటర్నరీ వీసీ టెక్నికల్ ఆఫీసర్‌గా సూర్యనారాయణ



తిరుపతిరూరల్, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): ఎస్వీ వెటర్నరీ వర్సిటీ వీసీ ఇన్‌చార్జి టెక్నికల్ ఆఫీసర్‌గా(టీవోటూవీసీ) ఎల్ఎఫ్‌సీ విభాగ హెడ్ ప్రొఫెసర్ డాక్టర్ ఎంవీఏఎన్ సూర్యనారాయణను నియమిస్తూ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ సీహెచ్ శ్రీలత బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఈ మేరకు ఆయన బాధ్యతలు చేపట్టారు. విభాగ హెడ్‌గా పనిచేస్తూ టెక్నికల్ ఆఫీసర్ అదనపు బాధ్యతలు నిర్వర్తించాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. ఆయన్ను పలువురు ప్రొఫెసర్లు, అధ్యాపకులు, ఉద్యోగులు అభినందించారు.

ఉద్యోగ నైపుణ్యాలపై శిక్షణ



విద్యార్థులతో అసిస్టెంట్ డైరెక్టర్ మునిరత్నం, అధ్యాపకులు

తిరుపతి(గాంధీరోడ్డు), జనవరి 22 (ఆంధ్రజ్యోతి): ఎల్ఐసీ రోడ్డులోని ఎమరాల్డ్స్ డిగ్రీ కళాశాలలో ఫైనలియర్ కోర్సులు చదివే విద్యార్థులకు చెన్నైకి చెందిన ఐసీటీ అకాడమీ, ఇన్ఫోసిస్ ఫౌండేషన్ సంస్థ సంయుక్త ఆధ్వర్యంలో ఫినిషింగ్ స్కూల్ ఫర్ ఎంప్లాయిబిలిటీ పేరిట నిర్వహించిన ఉద్యోగ నైపుణ్యాలపై శిక్షణా కార్యక్రమాన్ని బుధవారం ప్రారంభించారు. కళాశాల అసిస్టెంట్ డైరెక్టర్ ఎన్.మునిరత్నం మాట్లాడుతూ బ్యాంకింగ్, ఐటీ, ఇన్సూరెన్స్, కమ్యూనికేషన్ స్కిల్స్‌పై విద్యార్థులకు నెలరోజులపాటు శిక్షణ నిర్వహిస్తున్నామని, సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఐసీటీ అకాడమీ ప్రతినిధులు నాగేశ్వరరావు, ప్రశాంత్, కోఆర్డినేటర్ మదన్‌మోహన్, శ్రీనివాసులురెడ్డి పాల్గొన్నారు.

రేపు మెగా రక్తదాన శిబిరం

తిరుపతి(ఆటోనగర్), జనవరి22 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ కెమిస్ట్ అండ్ డ్రగ్గిస్ట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో తిరుపతిలోని కరకంబాడి వద్దగల బాలాజీ పెడ్‌టాప్ కెమిస్ట్ భవనంలో శుక్రవారం ఉదయం 10 గంటలకు మెగా రక్తదాన శిబిరం నిర్వహిస్తున్నామని తిరుపతి శాఖ అధ్యక్షుడు పీవీ రత్నం ఒక ప్రకటనలో తెలిపారు. సాయంత్రం 5గంటల వరకు కొనసాగుతుందని పేర్కొన్నారు.

ప్రభుత్వ సబ్సిడీతో సొంతింటి నిర్మాణానికి దరఖాస్తుల ఆహ్వానం

తిరుపతి, జనవరి 22 (ఆంధ్రజ్యోతి) : నగరంలో సొంత స్థలం కలిగి ఉండి ప్రధానమంత్రి ఆవాస్ యోజన పథకం కింద ప్రభుత్వ సబ్సిడీ ద్వారా ఇల్లు నిర్మించుకోవడానికి అర్హులైన లబ్ధిదారుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు తిరుపతి నగరపాలక కమిషనర్ ఎన్.మౌర్య బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఏపీ హౌసింగ్ కార్పొరేషన్ ద్వారా రూ.2.5లక్షల ప్రభుత్వ సబ్సిడీ పొంది సొంతంగా ఇల్లు నిర్మించుకోవచ్చని పేర్కొన్నారు. ఆసక్తి ఉన్న లబ్ధిదారులు సంబంధిత వార్డు సచివాలయంలో అమెనిటీ సెక్రటరీని కలసి ఆధార్, రేషన్, పాన్ కార్డుల జిరాక్స్‌లు, కుల, ఆదాయ ధ్రువీకరణ సర్టిఫికెట్, స్థల పత్రాలు, బ్యాంక్ అకౌంట్ పాస్ బుక్ తదితర పత్రాలను సమర్పించి దరఖాస్తు చేసుకోవాలని వివరించారు.

డాక్టరేట్ ప్రదానం



రాజేష్

తిరుపతి (విశ్వవిద్యాలయాలు) జనవరి 22 (ఆంధ్రజ్యోతి): ఎస్వీయూ సోషియాలజీ పరిశోధకుడు ఎం.రాజేష్ డాక్టరేట్ పొందారు. చిత్తూరు జిల్లాలో టెలిమెడిసిన్ అమలుపై ప్రొఫెసర్ జీఎస్ జయకుమార్ పర్యవేక్షణలో పరిశోధన పూర్తి చేసినట్లు సీఈ దామ్లానాయక్ తెలిపారు.

గోవిందరాజస్వామి ఆలయంలో కియోస్కి యంత్రం



కియోస్కి యంత్రాన్ని ప్రారంభిస్తున్న అధికారులు

తిరుపతి (విశ్వవిద్యాలయాలు) జనవరి 22 (ఆంధ్రజ్యోతి): స్థానిక గోవిందరాజస్వామి ఆలయంలో బుధవారం కియోస్కి యంత్రాన్ని ప్రారంభించారు. ఎస్బీఐ డీజీఎం లేఖామీనన్, ఆర్ఎం వెంకటేశ్వరరావు, టీటీడీ డిప్యూటీ ఈవో వాణి తదితరులు ప్రారంభించారు. ఈ యంత్రం ద్వారా స్వామి వారికి భక్తులు డిజిటల్ రూపంలో విరాళాలు, కానుకలు సమర్పించడానికి అవకాశం ఏర్పడుతుందని అన్నారు. కార్యక్రమంలో ఆలయ, ఎస్బీఐ అధికారులు, సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.

గణతంత్ర వేడుకలను ఘనంగా నిర్వహిద్దాం

తిరుపతి(కలెక్టరేట్), జనవరి 22 (ఆంధ్రజ్యోతి): గణతంత్ర దినోత్సవానికి పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ వెంకటేశ్వర్ అధికారులను ఆదేశించారు. బుధవారం వర్చువల్ విధానంలో ఆయన పలు శాఖల అధికారులతో సమీక్షించారు. ఈ నెల 26న నగరంలోని పోలీస్‌పెరేడ్ గ్రౌండ్‌లో గణతంత్ర వేడుకలను అన్ని శాఖల అధికారులు సమన్వయంతో విజయవంతం చేయాలన్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలపై స్టాల్స్, శకటాలు, వివిధ అంశాలపై సమీక్షించారు. కార్యక్రమంలో జేసీ శుభం బన్సల్, డీఆర్వో నరసింహులు, మున్సిపల్ కమిషనర్ మౌర్య తదితరులు పాల్గొన్నారు.

డ్రంకెన్ డ్రైవ్‌లో 11 మందికి జరిమానా

తిరుపతి(నేరవిభాగం), జనవరి 22(ఆంధ్రజ్యోతి): నగరంలో అధిక మోతాదులో మద్యం తాగి వాహనాలు నడిపిన కేసుల్లో నాలుగవ అదనపు జ్యుడీషియల్ న్యాయమూర్తి గ్రంధి శ్రీనివాస్ 11 మందికి జరిమానా విధిస్తూ బుధవారం తీర్పు చెప్పారు. ఒక్కొక్కరికి రూ.10వేల లెక్కన దాదాపు రూ.1.10 లక్షలు విధించారు.

వీధి వ్యాపారులను ఇబ్బంది పెట్టకండి

తిరుపతి(ఆటోనగర్), జనవరి 22 (ఆంధ్రజ్యోతి): నగరంలో తోపుడు బండ్లపై వ్యాపారాలు చేసుకుంటున్న వీధి వ్యాపారులకు ఇబ్బంది కల్గించరాదని సీఐటీయూ నగర నాయకులు వేణుగోపాల్, బుజ్జిలు కోరారు. బుధవారం వారు నగరపాలక సంస్థ కమిషనర్ మౌర్యాను కలసి వినతిపత్రం ఇచ్చారు. వీధుల్లో వ్యాపారం చేసుకుంటున్న వారి నుంచి అధికారులు దౌర్జన్యం చేసి, బండ్లు తీసుకురావడం అన్యాయమన్నారు. వెంటనే వాటిని తిరిగి ఇచ్చేయాలని కోరారు. వీధి వ్యాపారులకు గుర్తింపు కార్డులు, ముద్రా రుణాలు ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు శ్రీనివాసులు, అశోక్, వెంకటేష్, అమీర్, చంద్రశేఖర్ పాల్గొన్నారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

తిరుపతి(ఆటోనగర్),జనవరి 22(ఆంధ్రజ్యోతి):తిరుపతి విద్యుత్ టౌన్ డివిజన్ పరిధిలోని 220 కేవీ, రేణిగుంట 132 కేవీ విద్యుత్ లైన్ల మరమ్మతుల కారణంగా పానకం, వేమూరు 11కేవీ ఫీడర్ల పరిధిలో గురువారం ఉదయం 8నుంచి సాయంత్రం 5గంటల వరకు విద్యుత్‌సరఫరాలో అంతరాయం ఉంటుందని టౌన్ డివిజన్ ఈఈ వి.చంద్రశేఖరరావు ఒక ప్రకటనలో తెలిపారు. పానకం, వేమూరు, గంగనగుంట, మిట్టమీద కండ్రిగ, కస్తూరి కండ్రిగ, ముండ్లపూడి ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని పేర్కొన్నారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

నేడు రాళ్లపల్లె అనంతకృష్ణశర్మ జయంతి

తిరుపతి (విశ్వవిద్యాలయాలు) జనవరి 22 (ఆంధ్రజ్యోతి): సాహిత్య, సంగీతవేత్త రాళ్లపల్లె అనంతకృష్ణశర్మ 133వ జయంతి కార్యక్రమం నగరంలో నిర్వహించనున్నారు. టీటీడీ అన్నమాచార్య ప్రాజెక్టు, హిందూ ధార్మిక సంస్థలు సంయుక్తంగా గురువారం ఉదయం 10 గంటలకు అన్నమాచార్య కళా మందిరంలో ఈ కార్యక్రమం చేపట్టనున్నాయి. అనంతపురం జిల్లా రాళ్లపల్లె గ్రామంలో 1893 జనవరి 23వ తేదీన అనంతకృష్ణశర్మ జన్మించారు. మైసూరు మహారాజ కాలేజీలో 8 ఏళ్ల తెలుగు ఆచార్యులుగా సేవలందించారు. రేడియోకు ఆకాశవాణి అని పేరు పెట్టింది ఆయనే. ఆయన ప్రతిభను గుర్తించి నాటి టీటీడీ ఈవో చెలికాని అన్నారావు 1949లో ఓఆర్ఐ నిర్వహణ బాధ్యతలను అప్పగించారు. అన్నమయ్య రాసిన వందల సంకీర్తనలను పరిష్కరించడం, స్వర పరచడం, గ్రంథస్తం చేయడంలో రాళ్లపల్లె కృషి చేశారు. 1979 మార్చి 11న టీటీడీ ఆస్థాన విద్వాంసులుగా చేరారు. ఇలా సాహిత్య, సంగీత రంగాల్లో విశేష సేవలు అందించిన రాళ్లపల్లె అనంతకృష్ణశర్మ జయంతిని టీటీడీ అధికారికంగా నిర్వహించనుంది.

వేడుకగా అయోధ్య బలరాముడి ఆరాధనోత్సవం



తిరుపతి (విశ్వవిద్యాలయాలు), జనవరి 22 (ఆంధ్రజ్యోతి): అయోధ్యలో బలరాముడి విగ్రహానికి ప్రాణ ప్రతిష్ఠ చేసి ఏడాది పూర్తయిన సందర్భంగా అయోధ్య బలరాముడి ఆరాధానోత్సవం బుధవారం తిరుపతిలో వేడుకగా నిర్వహించారు. లోక కల్యాణం, దేశ సుభిక్షం కోసం దేశం నలుమూలలా ఉన్న ఆలయాల్లో రాముడి ఆరాధనోత్సవాలు చేపట్టాలని ప్రధాని మోదీ పిలుపుతో ఈ కార్యక్రమాన్ని చేపట్టారు. పెద్దకాపు వీధిలోని శ్రీరామ భజన మందిరం వద్ద సాయంత్రం బలరాముని చిత్రపటానికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. దీపారాధన, రామ భజన, అన్నప్రసాద వితరణ నిర్వహించారు. కార్యక్రమంలో మోహన్‌రెడ్డి, అక్కిపల్లి మునికృష్ణయ్యయాదవ్, కోటేశ్వరరావు, సితేంద్రశర్మ, వాసు, ఆదిలక్ష్మి, నిర్మల, లీలావతి, నరసింహయాదవ్, సుబ్రమణ్యంరెడ్డి పాల్గొన్నారు.

ఆరుగురికి స్పోర్ట్స్ మెరిట్ స్కాలర్‌షిప్



స్కాలర్‌షిప్ అందుకున్న విద్యార్థులు

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), జనవరి 22 (ఆంధ్రజ్యోతి): పద్మావతి డిగ్రీ కాలేజీకి చెందిన ఆరుగురు విద్యార్థినులకు ఎస్వీయూ నుంచి రూ.6 వేల చొప్పున స్పోర్ట్స్ మెరిట్ స్కాలర్‌షిప్ మంజూరైంది. ఎంపికైన వారిలో మానస, నందిని, గౌరిప్రియ, నేత్ర, స్వాతి, హర్షిత ఉన్నారు. చదువుతో పాటు క్రీడా రంగంలోనూ రాణించినందుకు ఈ స్కాలర్‌షిప్‌కు ఎంపికయ్యారు. వీరిని ప్రిన్సిపాల్ నారాయణమ్మ, పీడీ భారతి, అధ్యాపకులు ప్రవల్లిక, లక్ష్మి, పద్మజ, ఉమారాణి అభినందించారు.

వళ్లువన్ కులానికి ప్రాధాన్యత ఇవ్వండి

తిరుపతి అర్బన్, జనవరి 22(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో వళ్లువన్ కులానికీ ప్రాధాన్యత ఇవ్వాలని ఏపీ వళ్లువన్ సంక్షేమ సంఘం అధ్యక్షుడు కె.శ్రీరాములు మంగళవారం చిత్తూరులో ఏకసభ్య కమిషన్ చైర్మన్ రాజీవ్‌రంజన్‌మిశ్రకు వినతిపత్రం అందజేశారు. ఎస్సీ ఉప కులాలలో చిట్టచివరగా ఉన్న వళ్లువన్ కులానికి సంబంధించి తమిళనాడు ప్రభుత్వం ఎస్సీలుగా గుర్తించిందని కమిషన్ దృష్టికి తెచ్చారు. ఏపీలోనూ విచారణ జరిపి ప్రాధాన్యత ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో సంఘం నేతలు కె.మోహన్, పన్నీర్‌సెల్వం, సుందర్‌రాజన్, మురళీమోహన్ పాల్గొన్నారు.

ఏఎన్నార్‌కు ఘన నివాళి



తిరుపతి, జనవరి 22 (ఆంధ్రజ్యోతి) : అక్కినేని నాగేశ్వరరావు 11వ వర్ధంతిని పురస్కరించుకుని బుధవారం తిరుపతి కోనేటి కట్ట వద్ద అక్కినేని అభిమాన సంఘ నాయకులు ఆర్కాట్ కృష్ణప్రసాద్ ఆధ్వర్యంలో ఘన నివాళి అర్పించారు. దాదాపు 300 మందికి అన్నదానం చేశారు. ఏటా ఏఎన్నార్ జయంతి, వర్ధంతిలను అభిమానుల మధ్యలో నిర్వహించడం ఆనందంగా ఉందని తెలిపారు. కార్యక్రమంలో అభిమాన సంఘ నాయకులు గోపినాథ్, బాలరాజు, వేణు, ప్రసాద్, రమణ, చంద్ర, జగన్నాథం, కేశవులు, చంద్ర పాల్గొన్నారు.

రాయలసీమ రంగస్థలి ఆధ్వర్యంలో..

తిరుపతి (విశ్వవిద్యాలయాలు): ప్రముఖ నటుడు అక్కినేని నాగేశ్వరరావు వర్ధంతి సందర్భంగా తిరుపతిలో ఘన నివాళి అర్పించారు. రాయలసీమ రంగస్థలి అధ్యక్షుడు గుండాల గోపినాథరెడ్డి ఆధ్వర్యంలో ఆయన చిత్రపటానికి పుష్పాంజలి ఘటించారు.

హథీరాంజీ మఠాన్ని సందర్శించిన ఎమ్మెల్యే



తిరుపతి, జనవరి22(ఆంధ్రజ్యోతి) : స్థానిక హథీరాంజీ మఠాన్ని బుధవారం ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు సందర్శించారు. 120 ఏళ్ల కిందట మఠం భవనాన్ని నిర్మించినట్లు ఇంజనీరింగ్ అధికారులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకొచ్చారు. భవనం పటిష్టతపై నిపుణులు ఇచ్చే నివేదిక ఆధారంగా తదుపరి చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే తెలిపారు. కార్యక్రమంలో ఎన్డీఏ నాయకులు నరసింహ యాదవ్, రాజారెడ్డి, వరప్రసాద్, కార్పొరేటర్లు నరసింహాచారి, ఆర్సీ మునికృష్ణ, నైనార్ శ్రీనివాస్, సునీల్ చక్రవర్తి, కోదండ, సుధా, కేఎంకే లోకేష్, మహేష్ యాదవ్ తదితరుల పాల్గొన్నారు.



శ్రీహరిసేవలో మేలుకోట్ మఠాధిపతి

మేలుకోట్ మఠాధిపతి యదుగిరి యతిరాజ స్వామి బుధవారం తిరుమల శ్రీవారిని దర్శించుకున్నారు. ఉదయం నైవేద్య విరామ సమయంలో ఆలయ మహాద్వారం వద్దకు చేరుకున్న స్వామికి టీటీడీ అదనపు ఈవో వెంకయ్య చౌదరి, అర్చకబృందం ఇస్తికఫాల్(ఆలయ మర్యాదలు)తో స్వాగతం పలికారు. అలాగే బిగ్‌బాస్ ఫేం నటి అశ్వినిశ్రీ కూడా శ్రీవారిని దర్శించుకున్నారు.

- తిరుమల, ఆంధ్రజ్యోతి



ఆలయం ముందు యతిరాజ స్వామిజీ - అశ్వినిశ్రీ

చిత్రకూట్‌లో వైభవంగా శ్రీనివాసకల్యాణం

తిరుమల, జనవరి22(ఆంధ్రజ్యోతి): మహాకుంభమేళా సందర్భంగా మధ్యప్రదేశ్‌లోని చిత్రకూట్ నగరంలో ఉత్తరాది అహోబిలం మఠంలో బుధవారం ఉదయం శ్రీనివాస కల్యాణాన్ని టీటీడీ అంగరంగ వైభవంగా నిర్వహించింది. తిరుమల శ్రీవారి ఆలయ ప్రధాన అర్చకుడు వేణుగోపాల దీక్షితులు ఆధ్వర్యంలో అర్చక బృందం ఉదయం 11 నుంచి 12 గంటల నడుమ శాస్త్రోక్తంగా కల్యాణాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో 1008 రాజ్ గురు పీఠాధీశ్వర్ స్వామి బద్రి ప్రసన్నాచార్యజీ మహరాజ్, టీటీడీ ఎస్టేట్ ఆఫీసర్ గుణభూషణ్‌రెడ్డి పాల్గొన్నారు.

నేటితో ముగియనున్న అధ్యయనోత్సవాలు

తిరుమల, జనవరి22(ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవారి ఆలయంలో డిసెంబరు 30న ప్రారంభమైన అధ్యయనోత్సవాలు గురువారంతో ముగియనున్నాయి. 25 రోజుల్లో ఆళ్వార్ దివ్యప్రబంధంలోని 4 వేల పాశురాలను శ్రీవైష్ణవులు స్వామివారి ఆలయంలోని రంగనాయక మండపంలో పారాయణం చేశారు. నేడు తణ్ణీరముదు ఉత్సవంతో అధ్యయనోత్సవాలు ముగుస్తాయి.

శ్రీహరి సర్వదర్శనానికి 12 గంటలు

తిరుమల వేంకటేశ్వరస్వామి దర్శనానికి 12 గంటల సమయం పడుతోంది. బుధవారం సాయంత్రం 5 గంటల వరకు ఉన్న సమాచారం మేరకు వైకుంఠం క్యూకాంప్లెక్స్2లో 23 కంపార్టుమెంట్లలో సర్వదర్శన భక్తులు, వైకుంఠం క్యూకాంప్లెక్స్1లో 6 కంపార్టుమెంట్లలో టైంస్లాట్ భక్తులు వేచిఉన్నారు.

సోమవారం నాటి హుండీ ఆదాయం: రూ.4.04 కోట్లు

మంగళవారం శ్రీవారిని దర్శించుకున్న భక్తులు: 60,581

తలనీలాలు సమర్పించినవారు: 19,228





మల్లిమడుగు రిజర్వాయరు పరిసరాల్లో ఎక్స్‌కవేటర్‌తో టిప్పర్‌లో నింపుతున్న మట్టి

మల్లిమడుగులో
మళ్లీ మట్టి తవ్వకాలు

● మైనింగ్ శాఖ పేరుతో చెక్‌పోస్టు ● చోద్యం చూస్తున్న అధికారులు

రేణిగుంట, జనవరి 22(ఆంధ్రజ్యోతి): మల్లిమడుగు రిజర్వాయరులో మళ్లీ అక్రమ మట్టి తవ్వకాలు మొదలయ్యాయి. ఏకంగా మైనింగ్ శాఖ సిబ్బంది అంటూ అనధికారికంగా చెక్‌పోస్టు ఏర్పాటు చేసి రాత్రీపగలు టన్నుల కొద్దీ మట్టిని టిప్పర్ల ద్వారా తరలిస్తున్నారు. ఇంత జరుగుతున్నా పోలీసులు కానీ, రెవెన్యూ అధికారులు కానీ ఇటువైపు కన్నెత్తి చూడకపోవడం పట్ల విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తొలి నెల నుంచి ఇక్కడినుంచి పలక మట్టిని అక్రమంగా తరలిస్తున్నారని ఆంధ్రజ్యోతి దినపత్రికలో వరుస కథనాలు వెలువడ్డాయి. స్పందించిన తహసీల్దారు సురేష్‌బాబు మూడు నెలల క్రితం ఈ ప్రాంతాన్ని తొ ని ఖీ చేశారు. టిప్పర్లు, లారీలు వెళ్లకుండా ప్రత్యేకంగా మూడు చోట్ల కందకాలను తవ్వించి మట్టి అక్రమ రవాణాకు అడ్డుకట్ట వేశారు. అయితే గడిచిన నెల రోజులుగా రాత్రి సమయంలో మాత్రం గుట్టుచప్పుడు కాకుండా టిప్పర్లలో అక్రమంగా మట్టిని తరలిస్తున్నారు. ఇటీవల పది రోజులుగా రేణిగుంట, కడప ప్రధాన రహదారిలోని ఆంజనేయపురం చెక్‌పోస్టు సమీపంలోని పెట్రోల్ బంకు వద్ద మల్లిమడుగు రిజర్వాయరులోకి వెళ్లే మట్టిరోడ్డు వద్ద ప్రత్యేక చెక్‌పోస్టును తలపించేలా ఇనుప రేకులతో రూమును ఏర్పాటు చేశారు. రోడ్డుకు ఇరువైపులా ప్రత్యేక డ్రెస్ కోడ్‌తో యువకులను ఉంచారు. వీరు రెండు షిఫ్టుల్లో విధులు నిర్వహిస్తున్నారు. మల్లిమడుగు రిజర్వాయరు నుంచి వెళ్లే లారీ నెంబర్లను బిల్లులను రిజిస్టర్‌లో నమోదు చేస్తూ ఉంటారు. ఈ యువకులను ప్రశ్నించగా తాము మైనింగ్ శాఖకు సంబంధించిన వాళ్లమని కడప వైపు నుంచి వచ్చే వాహనాలను తనిఖీ చేస్తామని చెప్పుకొచ్చారు. అయితే మల్లిమడుగు రిజర్వాయరులో మట్టి తరలింపునకు అనధికారికంగా వేలం నిర్వహిస్తే తిరుపతికి చెందిన కొంతమంది అధిక మొత్తంలో పాడుకున్నట్టు తెలుస్తోంది. ఇక్కడి మట్టిని తిర ు పతి, చంద్రగిరి, పాకాల, శ్రీకాళహస్తి, తొట్టంబేడు, పుత్తూరు, నగరి ప్రాంతాలకు ప్రతి రోజు తరలిస్తున్నారు. ఈ లారీలు ఇప్పటి వరకు నిత్యం ఈ రహదారిలో విధులు నిర్వహించే బ్రేక్ ఇన్‌స్పెక్టర్, పోలీసులకు కనపడకపోవడం ఆశ్చర్యాన్ని కలిగిస్తోంది. ఇప్పటికైనా మట్టి, ఇసుక అక్రమ రవాణాను అరికట్టేందుకు మైనింగ్ శాఖ అధికారులు, మండల పోలీసులు, రెవెన్యూ, మండల అధికారులను సమన్వయం చేసుకుని ముందుకు వెళితే కొంతైనా ఈ అక్రమ రవాణాన్ని కట్టడి చేసే అవకాశం ఉంటుంది. ఈ విషయమై జిల్లా మైనింగ్ శాఖ అధికారి బాలాజీని వివరణ కోరగా మల్లిమడుగు రిజర్వాయర్ ప్రాంతంలో ఎటువంటి అనుమతులు ఎవరికీ ఇవ్వలేదని స్ప ష్టం చేశారు.



చెక్‌పోస్టు వద్ద మైనింగ్ శాఖ సిబ్బందిగా చెబుతున్న యువకుల ఫొటోలు తీస్తుండగా జారుకుంటున్న దృశ్యం



మట్టి అక్రమ తరలింపునకు ముద్రించిన బిల్లు



కమ్మలు తీసిస్తూ.. - మెడలో గొలుసు తీసిస్తున్న విద్యార్థిని

ప్రశాంతంగా జేఈఈ మెయిన్స్

● తొలిరోజు 89మంది విద్యార్థులు గైర్హాజరు

తిరుపతిరూరల్, జనవరి22(ఆంధ్రజ్యోతి): ఐఐటీ, ఎన్ఐటీ, ట్రిపుల్ ఐటీలలో ప్రవేశాల కోసం నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ ఆధ్వర్యంలో నిర్వహించిన తొలివిడత జేఈఈ మెయిన్స్ పరీక్షలు బుధవారం జిల్లాలో ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. ఉదయం 9-12గంటలు, మధ్యాహ్నం 3-6గంటల వరకు జరిగిన ఈ పరీక్షలకు తొలిరోజు 2326మంది విద్యార్థులకుగాను 2237 మంది హాజరై పరీక్ష రాశారని సిటీకోఆర్డినేటర్ టీకైలాష్‌నాథ్ పేర్కొన్నారు. 89మంది విద్యార్థులు పరీక్షకు హాజరుకాలేదన్నారు. ఎన్‌టీఏ నిబంధనల ప్రకారం విద్యార్థులను క్షుణంగా తనిఖీ చేసి కేంద్రాలోకి అనుమతించారు. చెవిలో కమ్మలు, మెడలో గొలుసులు, కాళ్ల వద్ద డ్రెస్‌కు దారాలుంటూ వీటినీ తీసేయించారు. నిర్ణీత సమయానికి కేంద్రాల వద్ద ప్రధాన గేటును మూసివేశారు. జిల్లాలో తిరుపతిరూరల్‌మండలం జూపార్క్‌రోడ్డు (చెర్లోపల్లె)లోని అయాన్‌డిజిటల్, చంద్రగిరిమండలంలో రామిరెడ్డిపల్లెలోని కేఎంఎం, కోటమండలం విద్యానగర్‌లోని ఎన్‌బీకేఆర్ సైన్స్ అండ్ ఆర్ట్స్ కళాశాల కేంద్రాలను కేటాయించారు. కాగా చెర్లోపల్లెలోని అయాన్‌డిజిటల్ కేంద్రం వద్ద ఉదయం 7గంటల నుంచి విద్యార్థులు వారి తల్లిదండ్రులతో సందడి నెలకొంది. విద్యార్థులు దాదాపుగా సకాలంలో కేంద్రాలకు చేరుకోవడం జరిగింది. ఆలస్యంగా వచ్చి వెనుతిరిగిన సంఘటనలు చోటుచేసుకోలేదు. సహాయకులుగా వచ్చిన వారు విద్యార్థులకు ఆల్‌దిబెస్ట్ చెబుతూ కనిపించారు. కాగా తొలి రోజు నిర్వహించిన పరీక్షలో ప్రశ్నాపత్రం ఈజీగా ఉందని కొందరు విద్యార్థులు అంటుండగా.. మరికొందరు గణితం, ఫిజిక్స్ సబ్జెక్టుల ప్రశ్నలు కొంత కఠినంగా, కెమిస్ట్రీ ప్రశ్నలు కొంత ఈజీగా ఉన్నాయని చర్చించుకుంటూ కనిపించారు.



తిరుపతి నగరం జూపార్కు రోడ్డులోని అయాన్ డిజిటల్ కేంద్రంలో విద్యార్థులు

జిల్లాకు 79 కొత్త ఆర్టీసీ బస్సులు



తిరుపతి(ఆర్టీసీ), జనవరి 22 (ఆంధ్రజ్యోతి): జిల్లా పరిధిలోని 10 డిపోలకు 79 నూతన ఆర్టీసీ బస్సులు వచ్చాయి. ఇందులో ఆర్టీసీ సొంత బస్సులు 50, అద్దె బస్సులు 29 ఉన్నాయి. ఇప్పటికే కొన్ని బస్సులు వివిధ రూట్లలో తిరుగుతుండగా కొన్ని మాత్రం రిజిస్ట్రేషన్ కోసం వేచి ఉన్నాయి. అవి కూడా ఈ వారంలో రోడ్డెక్కుతాయని డీపీటీవో నరసింహులు తెలిపారు.

సొంత బస్సులు: అల్ట్రా డీలెక్స్- తిరుపతి డిపోకు 2, సూపర్‌లగ్జరీ- తిరుపతి 7, వెంకటగిరి 6, శ్రీకాళహస్తి 3, మంగళం, సత్యవేడు ఒక్కొక్కటి, ఎక్స్‌ప్రెస్‌లు-వాకాడు 12, గూడూరు, వెంకటగిరి 9చొప్పున.

అద్దె బస్సులు: సూపర్‌లగ్జరీ-తిరుపతి 2, ఎక్స్‌ప్రెస్‌లు-తిరుపతి 3, వెంకటగిరి 10, గూడూరు 1, వాకాడు 4. పల్లెవెలుగు-శ్రీకాళహస్తి 1, సత్యవేడు 3, వెంకటగిరి 2, గూడూరు 3.

ఉపసర్పంచి కుటుంబానికి పరిహారం అందజేత



చంద్రగిరి, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): ఏనుగుల దాడిలో ఇటీవల మృతి చెందిన కందులవారి పల్లె పంచాయతీ ఉప సర్పంచ్ రాకేష్‌చౌదరి కుటుంబానికి అటవీశాఖ నష్టపరిహారం ప్రకటించింది. పరిహారం కింద రూ.10 లక్షల చెక్కును ఆ శాఖ అధికారులు బుధవారం బుధవారం బాధిత కుటుంబ సభ్యులకు అందజేశారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే పులివర్తి నాని సతీమణి పులివర్తి సుధారెడ్డి,ఎఫ్ఆర్వో అనిత, ఎఫ్‌బీవో చిత్ర, టీడీపీ రాష్ట్ర మహిళా కార్యదర్శి సింగు సుధా తదితరులు పాల్గొన్నారు.

హలో.. మేము సీబీఐ

● మనీ లాండరింగ్ కేసులో అరెస్టు చేస్తామంటూ వృద్ధురాలికి బెదిరింపు

● రూ.2.5 కోట్లు లాగేసుకున్న సైబర్ నేరగాళ్లు

● కేసు పెట్టిన పది రోజుల్లోనే నిందితుడి అరెస్టు ● రూ.24.5 లక్షల రికవరీ

తిరుపతి(నేరవిభాగం), జనవరి 22(ఆంధ్రజ్యోతి): 'హలో.. మేము సీబీఐ' అంటూ డిజిటల్ అరెస్టుల పేరిట సైబర్ నేరగాళ్లు బెదిరిస్తున్నారు. మనీ లాండరింగ్‌కు పాల్పడ్డారంటూ.. తిరుపతిలో ఓ 65 ఏళ్ల మహిళను భయపెట్టారు. ఆమె నుంచి రూ.2.5 కోట్లు లాగేశారు. బాధితురాలి ఫిర్యాదుతో రంగంలోకి దిగిన వెస్ట్ పోలీసులు రాజమహేంద్రవరానికి చెందిన కీలక నిందితుడిని అరెస్టు చేశారు. ఈ వివరాలను బుధవారం సాయంత్రం ఇన్‌చార్జి ఎస్పీ మణికంఠ చందోలు మీడియాకు వెల్లడించారు. ఆ ప్రకారం.. రాజమహేంద్రవరానికి చెందిన పాలకొల్లు అరుణ్‌వినయ్‌కుమార్ ఎంబీఏ చదివాడు. ఈజీ మనీ కోసం దారులు వెదికాడు. వాట్సాప్ కాల్స్ ద్వారా అమాయకులను బెదిరించి వివిధ అకౌంట్లకు డబ్బులు వేసుకునేవాడు. ఇలా తిరుపతికి చెందిన 65 ఏళ్ల మహిళకు గతేడాది డిసెంబరులో వాట్సాప్ కాల్ వచ్చింది. తాను ఢిల్లీలో సీబీఐ అధికారినని చెప్పాడు. రూ.200 కోట్ల మనీలాండరింగ్ చేశావని, నీపై సీబీఐ కేసు నమోదైందని బెదిరించాడు. బ్యాంకు అకౌంట్ల నుంచి చట్ట వ్యతిరేకంగా వివిధ కార్యకలాపాలకు నగదు వాడుతున్నందున అరెస్టు చేస్తామని చెప్పాడు. ఇలా.. మరికొందరు సీబీఐ అంటూ ఆమెకు ఫోన్లు చేశారు. మీ అకౌంటులోని డబ్బులు తమకు పంపితే.. ఆ నగదు మనీలాండరింగ్‌లో ఉందా లేదా అనేది దర్యాప్తు చేస్తామని, లేకుంటే మీ ఖాతాలకు జమ చేస్తామన్నారు. ఆమెను మాయమాటలతో నమ్మించి దాదాపు రూ.2.5 కోట్లు వివిధ ఖాతాలకు జమచేసుకున్నారు. చివరకు తాను సైబర్ నేరగాళ్ల నుంచి మోసపోయానని గుర్తించిన బాధిత మహిళ ఈ నెల 13న వెస్ట్ సీఐ మురళీమోహన్‌కు ఫిర్యాదు చేయగా, కేసు నమోదు చేశారు.



అంతర్జాతీయ సైబర్ నేరగాడు అరెస్టు చేసి నగదు, బంగారు నగలు స్వాధీనం చేసుకున్న తిరుపతి పోలీసులు

దర్యాప్తునకు ప్రత్యేక బృందాలు

ఈ కేసు దర్యాప్తునకు అదనపు ఎస్పీ వెంకట్రావు నేతృత్వంలో డీఎస్పీ వెంకటనారాయణ పర్యవేక్షణలో సీఐలు వినోద్ (సైబర్ క్రైం), మురళీమోహన్ (వెస్ట్), ప్రకాష్‌కుమార్ (క్రైం), ఎస్ఐలు, సిబ్బందితో బృందాలను ఏర్పాటు చేశారు. నిందితులు వాడిన సెల్ ఫోను నెంబరు, బాధితురాలికి వచ్చిన వాట్సాప్ కాల్ నెంబరు ఆధారంగా దర్యాప్తు చేపట్టారు. రాజమహేంద్రవరం కేంద్రంగా ఇలా బెదిరించి ఆన్‌లైన్ ద్వారా నిందితులు డబ్బులు కాజేస్తున్నట్లు గుర్తించారు. ఈ కేసులో కీలక నిందితుడు అరుణ్ వినయ్‌కుమార్‌ను బుధవారం రాజమహేంద్రవరంలో అరెస్టు చేసి తిరుపతికి తీసుకొచ్చారు. ఎస్పీ ఆధ్వర్యంలో మీడియా ముందు హాజరుపరిచారు. ఇతడి నుంచి కొత్త కారు, బ్యాంకులోని రూ24.5 లక్షల నగదు, రెండు ల్యాప్‌టాప్‌లు, రెండు సెల్ ఫోన్లు, 16 గ్రాముల బంగారు నగలు, ఎలక్ట్రానిక్ పరికరాలను స్వాధీనం చేసుకున్నారు. ఇంకా ఆరేడుగురు నిందితులున్నారని, వారికోసం గాలిస్తున్నారు. ఈ కేసులో కృషి చేసిన పోలీసు అధికారులు, సిబ్బందిని ఇన్‌చార్జి ఎస్పీ మణికంఠ అభినందించారు. వారికి రివార్డులు ప్రకటించారు.

నేడు సామూహిక సూర్య నమస్కారం

తిరుపతి(క్రీడలు), జనవరి 22 (ఆంధ్రజ్యోతి): నేతాజీ సుభాష్ చంద్రబోస్, వివేకానంద జయంతి ఉత్సవాల ముగింపు పరాక్రమ్ దివస్ సందర్భంగా శ్రీవేంకటేశ్వర యూనివర్సిటీ, వివేకానంద కేంద్ర సంయుక్త ఆధ్వర్యంలో గురువారం ఉదయం 10వేల మందితో సామూహిక సూర్య నమస్కారం కార్యక్రమం నిర్వహించనున్నారు. ఉదయం 7 గంటలకు ప్రారంభం కానున్న ఈ కార్యక్రమంలో 12నుంచి 50 సంవత్సరాల లోపు వారు పాల్గొనవచ్చు. అల్పాహారం, యోగా పుస్తకం, శ్రీవారి ప్రసాదాలు అందజేస్తారు.

స్విమ్స్‌లో ఆల్ట్రాసౌండ్ స్కానింగ్ పరీక్షలు వాయిదా

తిరుపతి(వైద్యం), జనవరి 22(ఆంధ్రజ్యోతి): స్విమ్స్ రేడియాలజీ విభాగం ఆధ్వర్యంలో గర్భిణులకు ప్రతి ఆదివారమూ ఉచితంగా నిర్వహించే ఆల్ట్రాసౌండ్ స్కానింగ్ పరీక్షలను తాత్కాలికంగా వాయిదా వేస్తున్నట్లు మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ రామ్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 26వ తేదీన చేపట్టాల్సిన పరీక్షలను వాయిదా వేశామని, ఫిబ్రవరి 2 నుంచి యధావిధిగా కొనసాగుతాయని పేర్కొన్నారు.

తిరుపతిలో తమిళనాడు భక్తుడి మృతి

తిరుపతి(నేరవిభాగం), జనవరి 22(ఆంధ్రజ్యోతి): తమిళనాడు రాష్ట్రం విరుధనగర్‌కు చెందిన జయకన్నన్ (45) బుధవారం తిరుపతిలోని ఓ లాడ్జిలో మృతిచెందారు. ఈస్ట్ ఎస్ఐ బాలకృష్ణ కథనం మేరకు.. కొంతకాలంగా మూర్ఛతో బాధపడుతున్న జయకన్నన్, మంగళవాం శ్రీవారి దర్శనార్థం తిరుమల వచ్చారు. తిరుపతి ఈస్ట్ పరిధిలోని ఓ లాడ్జిలో గది తీసుకున్నారు. మద్యం తాగి పడుకున్న ఆయన ఎంతకీ బయటకు రాలేదు. సిబ్బంది తలుపులు తట్టినా స్పందించకపోవడంతో నిర్వాహకులు ఈస్ట్ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో ఎస్ఐ కేసు నమోదు చేశారు.

ఉద్యోగం ఇప్పిస్తామని రూ.11 లక్షలు కాజేసారు

తిరుపతి(నేరవిభాగం), జనవరి 22(ఆంధ్రజ్యోతి): ఉద్యోగం ఇప్పిస్తామని చెప్పి తిరుపతి యాదవకాలనీకి చెందిన పి.హేమలత వద్ద ముగ్గురు దాదాపు రూ.11లక్షలు కాజేశారు. బాధితురాలు తెలిపిన ప్రకారం.. ఉద్యోగ ప్రయత్నాల్లో ఉన్న ఈమెను కొందరు కలిశారు. డబ్బులిస్తే ఉద్యోగం ఇప్పిస్తామని నమ్మించారు. ఈ క్రమంలో గుంటూరుకు చెందిన లక్ష్మీనారాయణకు 6.57 లక్షలు, సనబోయిన వినీత్‌కుమార్‌కు రూ.2.15 లక్షలు, మారేడు నరేష్‌కుమార్‌కు రూ.2.40 లక్షలు పంపారు. ఎంతకూ ఉద్యోగం రాకపోవడంతో మోసపోయానని గుర్తించిన ఆమె బుధవారం ఈస్ట్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఎస్ఐ బాలకృష్ణ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ప్రాజెక్టు అసిస్టెంట్ పోస్టుకు దరఖాస్తుల ఆహ్వానం

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), జనవరి 22 (ఆంధ్రజ్యోతి): పద్మావతి మహిళా వర్సిటీలో పరిశోధనా ప్రాజెక్టులో రీసెర్చ్ అసిస్టెంట్ పోస్టుకు ఈ నెల 25లోగా దరఖాస్తు చేసుకోవాలి. 27న ఇంటర్వ్యూ నిర్వహిస్తారు. ఎంపీఈడీ, ఎమ్మెస్సీ హోంసైన్స్ చదువుకున్న వారు అర్హులు. ఇతర వివరాలకు ఎస్‌పీఎంవీవీ.. వెబ్‌సైట్ చూడాలని వర్సిటీ పీఆర్వో డాక్టర్ శ్రీరజని కోరారు.

గ్రామీణ క్రీడాకారులను ప్రోత్సహిద్దాం

డీఎస్‌డీవోలతో సమీక్షించిన శాప్ చైర్మన్



డీఎస్‌డీవోలతో సమీక్షిస్తున్న శాప్ చైర్మన్ రవినాయుడు

తిరుపతి(క్రీడలు), జనవరి 22(ఆంధ్రజ్యోతి): గ్రామీణ ప్రాంతాల క్రీడాకారులను ప్రోత్సాహించి వారి ప్రతిభను గుర్తించే చర్యలు చేపడుదామని శాప్ చైర్మన్ ఎ.రవినాయుడు అధికారులకు సూచించారు. బుధవారం ఆయన స్థానిక శ్రీనివాస క్రీడా సముదాయంలో తిరుపతి, చిత్తూరు జిల్లాల డీఎస్‌డీవోలు సయ్యద్‌సాహెబ్, బాలాజీలతో సమీక్షించారు. ఆర్థిక స్థోమత లేకుండా గ్రామీణ క్రీడాకారులు చదువులకే పరిమితవుతున్నారని, సత్తా ఉన్నా క్రీడల్లో వెనుకబడిపోతున్నారని గుర్తు చేశారు. అలాంటివారిని గుర్తించి దాతల సాయంతో చేయూతనందించే బాధ్యతలు తీసుకుందామన్నారు. గ్రామీణ పాఠశాలలలో పర్యటించి పీఈటీల ద్వారా క్రీడల్లో రాణిస్తున్న విద్యార్థులను ఎంపిక చేయలన్నారు. అమరరాజ సంస్థలో పనిచేసి ఉద్యోగ విరమణ చేసిన సహదేవనాయుడు ముందుకొచ్చి తాను సహకరిస్తానన్నారు. ఉమ్మడి చిత్తూరు జిల్లాలో పైలట్ ప్రాజెక్టుగా ప్రారంభించాలని, ఫలితాలను బట్టి ఇతర జిల్లాల్లోనూ అమలు చేద్దామని రవినాయుడు దిశానిర్దేశం చేశారు.

సామాన్య భక్తులకే ప్రాధాన్యం

● ముక్కంటి మహాశివరాత్రి ఉత్సవాలను ఘనంగా నిర్వహిస్తామన్న ఎమ్మెల్యే, కలెక్టర్



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ వెంకటేశ్వర్

శ్రీకాళహస్తి, జనవరి 22(ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తీశ్వరాలయ మహాశివరాత్రి ఉత్సవాల్లో సామాన్య భక్తులకే అధిక ప్రాధాన్యమిస్తూ వైభవోపేతంగా నిర్వహిస్తామని ఎమ్మెల్యే బొజ్జల సుధీర్, కలెక్టర్ వెంకటేశ్వర్ తెలిపారు. ముక్కంటి ఆలయ పరిపాలన భవనంలో బుధవారం మహాశివరాత్రి ఉత్సవాల నిర్వహణపై వివిధ శాఖల అధికారులతో తొలి సమన్వయ సమావేశం నిర్వహించారు. ఆలయ ఈవో బాపిరెడ్డితోను.. పోలీసు, మున్సిపల్, విద్యుత్, ఇరిగేషన్, ఆర్ అండ్‌బీ, అగ్నిమాపక, వైద్య తదితర శాఖల అధికారులతో ఉత్సవాల నిర్వహణపై చర్చించారు. ఏర్పాట్లు ప్రారంభించాలని అధికారులకు సూచించారు. అనంతరం మీడియాతో మాట్లాడారు. 'వైసీపీ హయాంలో జరిగిన మహాశివరాత్రి ఉత్సవాల్లో ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి స్వామివారి గర్భగుడి వద్ద బైఠాయించి సామాన్య భక్తులను ఇబ్బందులకు గురిచేశారు. వారి పార్టీ కార్యకర్తలను దళారులుగా మార్చారు. ఇప్పుడు అలాంటి ఘటనలు జరగకుండా కట్టుదిట్టంగా వ్యవహరిస్తాం. భక్తులందరూ సులభంగా టిక్కెట్లు కొనుగోలు చేసేలా 14 కౌంటర్లు ఏర్పాటు చేస్తున్నాం. ఈ కౌంటర్ల వద్ద రద్దీ తగ్గించేందుకు అన్ని పత్రికల్లో బార్‌కోడ్ ద్వారా ప్రకటనలు ఇస్తాం. దీంతో ఆన్‌లైన్‌లోనూ దర్శనం టిక్కెట్లు కొనుగోలు చేసేలా శ్రీకారం చుడుతున్నాం' అని ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డి తెలిపారు.

10 లక్షల మందికి దర్శనం

వీఐపీల కోసం ప్రత్యేక టైంస్లాట్ కేటాయించడంపై కసరత్తు చేస్తున్నామని కలెక్టర్ వెంకటేశ్వర్ తెలిపారు. 13రోజుల పాటు జరిగే ఉత్సవాల్లో సుమారు 10లక్షల మంది భక్తులకు దర్శనం కల్పించేలా ఏర్పాట్లు చేస్తామన్నారు. సాధారణ రోజుల్లో 750మందిని, కీలక రోజులుగా అదనంగా మరో 450మందిని బందోబస్తుకు కేటాయిస్తామన్నారు. ప్రస్తుతం 175 మరుగుదొడ్లు ఉండగా, ఫిబ్రవరి 21 నుంచి మార్చి 6 వరకు అదనంగా 200 మొబైల్ టాయిలెట్లు ఏర్పాటు చేస్తామన్నారు. పారిశుధ్య నిర్వహణ కోసం పట్టణ పారిశుధ్య సిబ్బందితో పాటు పొరుగు మండలాలు, మున్సిపాలిటీల నుంచి సిబ్బందిని బ్రహ్మోత్సవాలకు వినియోగిస్తామని వెల్లడించారు. పట్టణవ్యాప్తంగా సీసీ కెమెరాలు, డ్రోన్లతో పర్యవేక్షిస్తామన్నారు. బాల్య వివాహాల నిర్మూలనకు ప్రత్యేక బృందాలను నియమిస్తామన్నారు. 13రోజుల పాటు జరిగే ఉత్సవాల్లో విద్యుత్, ఆహారం, తాగునీరు సరఫరాకు ఎక్కడా చిన్న ఆటంకం కూడా ఏర్పడకుండా చర్యలు తీసుకుంటామన్నారు. త్వరలోనే ఉత్సవాలకు ఏర్పాట్లు ప్రారంభిస్తామని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో భానుప్రకాష్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

గూడూరు
సూళ్లూరుపేట/వెంకటగిరి

ఉన్నత విద్యతో ఉజ్వల భవిత



కార్యక్రమంలో మాట్లాడుతున్న గీత

నాయుడుపేట, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు వారు ఎంచుకున్న రంగాల్లో ఉన్నత విద్య అభ్యసించడం ద్వారా ఉజ్వల భవిష్యత్తు సిద్ధిస్తుందని గురుకులాల జిల్లా కోఆర్డినేటర్ ఏస్తేరు గీత అన్నారు. నాయుడుపేట ఎల్‌ఏ సాగరంలోని బాలుర గురుకులంలో బుధవారం ఏర్పాటు చేసిన సభలో ఆమె మాట్లాడారు. ప్రభుత్వం గురుకులాల్లోని విద్యార్థులకు అన్ని వసతులు, నాణ్యతా ప్రమాణాలతో కూడిన విద్యా బోధన జరుగుతోందన్నారు. తల్లిదండ్రులు లేని దాదాపు 100 మంది విద్యార్థులకు, గురుకులంలోని పారిశుధ్యం, సెక్యూరిటీ సిబ్బందికి స్థానిక వైదేహి షాపింగ్ మాల్ యజమాని సుబ్బారెడ్డి అందజేసిన దుస్తులను డీసీవో అందజేశారు. ఈ సందర్భంగా సుబ్బారెడ్డి మాట్లాడుతూ గురుకులాలకు తనవంతు సాయం అందిస్తామన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ దాదాపీర్, పుదూరు ప్రిన్సిపాల్ రూత్ రమోలా, విక్రమ్, పద్మజ, శేఖర్‌బాబు, వెంకటకృష్ణయ్య, కాటయ్య, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

కోర్టు ఉత్తర్వుల అమలుకు చర్యలు తీసుకోండి



డీఎస్పీ గీతాకుమారికి సమస్యలను విన్నవిస్తున్న సీపీఐ, ఏఐటీయూసీ, నాన్‌టీచింగ్ ఉద్యోగులు

గూడూరు అర్బన్, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): కోట మండలంలోని విద్యానగర్ ఎన్‌బీకేఆర్ కళాశాలలో నాన్ టీచింగ్ ఉద్యోగుల ప్రయోజనాలపై లేబర్‌కోర్టు ఇచ్చిన ఉత్తర్వులను కాలేజీ యాజమాన్యం పాటించేలా చర్యలు తీసుకోవాలని బుధవారం ఏఐటీయూసీ, సీపీఐ నాయకులతో పాటు నాన్‌టీచింగ్ ఉద్యోగులు డీఎస్పీ గీతాకుమారికి విన్నవించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎన్‌బీకేఆర్ ఇంజనీరింగ్ కళాశాలలో నాన్‌టీచింగ్ ఉద్యోగులకు సక్రమంగా జీతాలు ఇవ్వడంలేదని, రిటైర్‌మెంట్ బెనిఫిట్స్ కూడా అందించడం లేదన్నారు. వీటిపై గతంలో ఉద్యోగులు లేబర్ కోర్టుకు వెళ్లగా స్పష్టమైన ఆదేశాలను ఇచ్చి ఉద్యోగుల ప్రయోజనాలను కాపాడాలని ఆదేశించినట్లు తెలిపారు. కొన్ని నెలలుగా అపరిష్కృతంగా ఉన్న ఉదోగ్యుల సమస్యలను పరిష్కరిచేలా చర్యలు తీసుకోవాలని డీఎస్పీని కోరారు. దీనిపై సమగ్ర విచారణ చేసి పరిష్కారానికి కృషి చేస్తానని డీఎస్పీ హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ప్రభాకర్, శశికుమార్, చంద్రయ్య, వెంకటయ్య, బాబురావు, గౌస్‌బాష తదితరులు పాల్గొన్నారు.

చిరుధాన్యాల ఉత్పత్తుల తయారీపై శిక్షణ



అవగాహన కార్యక్రమంలో మాట్లాడుతున్న శాస్త్రవేత్త విజయశ్రీ

వెంకటగిరి టౌన్, జనవరి 22(ఆంధ్రజ్యోతి): వెంకటగిరిలోని కృషి విజ్ఞాన్ కేంద్రం, అదానీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో చిరుధాన్యాలు, మునగ ఆకు పొడితో బిస్కెట్స్ తయారీపై బుధవారం మహిళలకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కేవీకే ప్రిన్సిపాల్ శ్రీనివాసరెడ్డి గృహ విజ్ఞాన శాస్త్ర విభాగం ఆధ్వర్యంలో అదానీ ఫౌండేషన్, కృష్ణపట్నం పోర్టు సౌజన్యంతో ఎస్‌హెచ్‌జీ మహిళలకు చిరుధాన్యాల ఉత్పత్తుల తయారీపై శిక్షణ ఇవ్వడం జరిగిందన్నారు. ప్రస్తుతం చిరు ధాన్యాలకు డిమాండ్ పెరిగిందని, వాటి ద్వారా తినుబండరాలు తయారు చేసి విక్రయిస్తే లాభసాటిగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో గృహ విజ్ఞాన శాస్త్రవేత్త విజయశ్రీ, అదానీ ఫౌండేషన్ సభ్యులు సెల్వరాజ్, సాహల్ తదితరులు పాల్గొన్నారు.

31 నుంచి తైక్వాండో పోటీలు

తిరుపతి(క్రీడలు), జనవరి 22(ఆంధ్రజ్యోతి): కాకినాడలోని జేఎన్టీయూకే ఇండోర్ స్టేడియంలో ఈ నెల 31 నుంచి మూడు రోజుల పాటు ఎన్టీఆర్ మెమోరియల్ ఏపీ స్టేట్ తైక్వాండో చాంపియన్‌షిప్ పోటీలు నిర్వహించనున్నారు. దీనికి సంబంధించిన పోస్టర్‌ను శాప్ చైర్మన్ ఎ.రవినాయుడు బుధవారం శ్రీనివాస క్రీడా సముదాయంలో ఆవిష్కరించారు. కార్యక్రమంలో తిరుపతి, చిత్తూరు డీఎస్‌డీవోలు సయ్యద్‌సాహెబ్, బాలాజీ, తైక్వాండో అసోసియేషన్ ప్రతినిధులు మనోహర్, రమణ, శీను, లోకేశ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ సబ్సిడీతో సొంతింటి నిర్మాణానికి దరఖాస్తుల ఆహ్వానం

తిరుపతి, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): తిరుపతి నగరంలో సొంత స్థలం కలిగి ఉండి ప్రధానమంత్రి ఆవాస్ యోజన పథకం కింద ప్రభుత్వ సబ్సిడీ ద్వారా ఇల్లు నిర్మించుకోవడానికి అర్హులైన లబ్ధిదారుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు నగరపాలక కమిషనర్ ఎన్.మౌర్య బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఏపీ హౌసింగ్ కార్పొరేషన్ ద్వారా రూ.2.5లక్షల ప్రభుత్వ సబ్సిడీ పొంది సొంతంగా ఇల్లు నిర్మించుకోవచ్చన్నారు. ఆసక్తి ఉన్న లబ్ధిదారులు సంబంధిత వార్డు సచివాలయంలో ఆధార్, రేషన్, పాన్ కార్డుల జిరాక్స్‌లు, కుల, ఆదాయ ధ్రువీకరణ సర్టిఫికెట్, స్థల పత్రాలు, బ్యాంక్ అకౌంట్ పాస్ బుక్ తదితర పత్రాలను సమర్పించి దరఖాస్తు చేసుకోవాలని వివరించారు.

గోవిందరాజస్వామి ఆలయంలో కియోస్కి యంత్రం

తిరుపతి (విశ్వవిద్యాలయాలు) జనవరి 22 (ఆంధ్రజ్యోతి): స్థానిక గోవిందరాజస్వామి ఆలయంలో బుధవారం కియోస్కి యంత్రాన్ని ప్రారంభించారు. ఎస్బీఐ డీజీఎం లేఖామీనన్, ఆర్ఎం వెంకటేశ్వరరావు, టీటీడీ డిప్యూటీ ఈవో వాణి తదితరులు ప్రారంభించారు. ఈయంత్రం ద్వారా స్వామివారికి భక్తులు డిజిటల్ రూపంలో విరాళాలు, కానుకలు సమర్పించడానికి అవకాశం ఏర్పడుతుందన్నారు.

ఉద్యోగ నైపుణ్యాలపై శిక్షణ

తిరుపతి(గాంధీరోడ్డు), జనవరి 22 (ఆంధ్రజ్యోతి): ఎల్‌బీసీ రోడ్డులోని ఎమరాల్డ్స్ డిగ్రీ కళాశాలలో ఫైనలియర్ కోర్సులు చదివే విద్యార్థులకు చెన్నైకి చెందిన ఐసీటీ అకాడమీ, ఇన్ఫోసిస్ ఫౌండేషన్ సంస్థ సంయుక్త ఆధ్వర్యంలో ఫినిషింగ్ స్కూల్ ఫర్ ఎంప్లాయిబిలిటీ పేరిట నిర్వహించిన ఉద్యోగ నైపుణ్యాలపై శిక్షణా కార్యక్రమాన్ని బుధవారం ప్రారంభించారు. కళాశాల అసిస్టెంట్ డైరెక్టర్ ఎన్.మునిరత్నం మాట్లాడుతూ బ్యాంకింగ్, ఐటీ, ఇన్సూరెన్స్ కమ్యూనికేషన్ స్కిల్స్‌పై విద్యార్థులకు నెలరోజులపాటు శిక్షణ నిర్వహిస్తున్నామని, సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఐసీటీ అకాడమీ ప్రతినిధులు నాగేశ్వరరావు, ప్రశాంత్, కోఆర్డినేటర్ మదన్‌మోహన్ పాల్గొన్నారు.

డ్రంకెన్ డ్రైవ్‌లో 11 మందికి జరిమానా

తిరుపతి(నేరవిభాగం), జనవరి 22 (ఆంధ్రజ్యోతి): అధిక మోతాదులో మద్యం తాగి వాహనాలు నడిపిన కేసుల్లో నాలుగవ అదనపు జ్యుడీషియల్ న్యాయమూర్తి గ్రంధి శ్రీనివాస్ 11 మందికి జరిమానా విధిస్తూ బుధవారం తీర్పు చెప్పారు. ఒక్కొక్కరికి రూ.10వేల లెక్కన జరిమానా విధించారు.

రూ.1.20 కోట్లతో సీసీ రోడ్లు

ఓజిలి, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): మండలంలో రూ.1.20 కోట్ల వ్యయంతో సీసీ రోడ్ల నిర్మాణ పనులు జోరుగా జరుగుతున్నాయి. సూళ్లూరుపేట ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ నిధులు విడుదల చేయించడంతో టీడీపీ మండల కన్వీనరు విజయకుమార్ నాయుడు నాయకులను సమన్వయం చేసుకుని సీసీ రోడ్ల నిర్మాణ పనులు చేపట్టారు. పంచాయతీరాజ్ శాఖ అధికారులు పర్యవేక్షిస్తున్నారు.

నేటి నుంచి 'ఉల్లాస్'

తడ, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అన్ని గ్రామాల్లో గురువారం నుంచి ఉల్లాస్ కార్యక్రమం జరుగుతుందని ఎంపీడీవో విజయకుమార్ తెలిపారు. బుధవారం ఆయన మాట్లాడుతూ వయోజన విద్య కార్యక్రమంలో చదువుకునే వారికి ప్రతిరోజూ సాయంత్రం తరగతులు నిర్వహిస్తామన్నారు. సైబర్ క్రైమ్, ఆర్థిక సమానత్వం వంటి విషయాలపై అవగాహన కల్పిస్తామని చెప్పారు. అనంతరం అక్షర వెలుగు పుస్తకాలను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో వెలుగు ఏపీఎం రాజారెడ్డి, వెలుగు సీసీలు, వీవోఏలు తదితరులు పాల్గొన్నారు.

అధికారులు లేక కార్యాలయాలు వెలవెల



తహసీల్దార్ కార్యాలయంలో అధికారులు లేక ఖాళీ కుర్చీలు

సూళ్లూరుపేట, జనవరి 22(ఆంధ్రజ్యోతి): సూళ్లూరుపేటలో తహసీల్దార్, ఎంపీడీవో కార్యాలయాలు బుధవారం అధికారులు లేక వెలవెలపోయాయి. సూళ్లూరుపేటలో సోమవారం వరకు మూడు రోజుల పాటు జరిగిన పక్షుల పండగ నిర్వహణ విధుల్లో అధికారులు పాల్గొన్నారు. పక్షుల పండగ ముగిసి రెండు రోజులైనా కార్యాలయాలకు రాలేదు. బుధవారం రెవెన్యూ కార్యాలయంలో ఒక్క అధికారి కూడా కనిపించలేదు. తహసీల్దార్, డీటీ, ఆర్ఐ, సీనియర్ అసిస్టెంట్ గదుల్లో ఖాళీ కుర్చీలు దర్శనమిచ్చాయి. వివిధ పనుల నిమిత్తం కార్యాలయానికి వచ్చిన ప్రజలు పడిగాపులు కాచి వెనుతిరిగి వెళ్లారు. తహసీల్దారు సాయంత్రం 4 గంటలకు వచ్చి రాత్రి 7 గంటల వరకు కార్యాలయంలో ఉన్నారు. మండల పరిషత్ కార్యాలయంలోనూ ఇదే పరిస్థితి. ఎంపీడీవోతో పాటు కార్యాలయ సిబ్బంది ఎవరూ రాలేదు.



మంగళంపాడు బ్రాహ్మణ వీధిలో నిర్మిస్తున్న కల్వర్టు - ఆత్రేయ కాలనీలో సీసీ రోడ్డు నిర్మాణం - డ్రైన్ నిర్మాణానికి తవ్విన కాలువ

మంగళంపాడులో అభివృద్ధి పరుగులు

రూ.35 లక్షలతో సీసీ రోడ్లు, కాలువల నిర్మాణం

సూళ్లూరుపేట, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని మంగళంపాడు పంచాయతీలో అస్తవ్యస్తంగా ఉన్న డ్రైనేజీ, అధ్వానంగా ఉన్న దారులను బాగు చేసేందుకు సర్పంచు, టీడీపీ నాయకులు దృష్టి సారించారు. వైసీపీ ఐదేళ్ల పాలనలో గ్రామంలో కనీసం నీటి కుళాయి కూడా వేయలేదు. చిన్నపాటి వర్షమొచ్చినా వీధుల్లో నీరు నిలచి మురికి కూపాన్ని తలపించేది. ఎట్టకేలకు సర్పంచు రుక్మిణి, టీడీపీ నాయకులు ఎంబేటీ సతీష్ చొరవ తీసుకొని 15 ఆర్థిక సంఘం నిధులు రూ.15 లక్షలతో ఆత్రేయకాలనీలో సీసీ రోడ్డు, గ్రామంలోని ప్రధాన వీధుల్లో రెండుచోట్ల రూ.2 లక్షలతో కల్వర్టు నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. గ్రామంలో రోడ్డు పలుచోట్ల గుంతలు పడి అధ్వానంగా ఉండటంతో రూ.1.50 లక్షలతో మరమ్మతులు చేశారు. అంతేకాకుండా గ్రామంలో రూ.15 లక్షలతో కాలువల నిర్మాణం చేపట్టనున్నట్లు సర్పంచు తెలిపారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి చర్యలు



ప్రజల నుంచి సమస్యలను తెలుసుకుంటున్న ఎమ్మెల్యే పాశిం సునీల్‌కుమార్

గూడూరు, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలోని ప్రజల సమస్యలను తెలుసుకుని, వాటిని సత్వరమే పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటున్నానని ఎమ్మెల్యే పాశిం సునీల్‌కుమార్ అన్నారు. బుధవారం స్థానిక ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ప్రజలు అందజేసిన వినతులను ఆయన స్వీకరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను తెలుసుకుని సంబంధిత అధికారుల దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు.

చిట్టేడులో జ్వరాలపై ఆరా



ఆరోగ్యకేంద్రంలో రికార్డులను పరిశీలిస్తున్న అడిషనల్ డీఎంఅండ్‌హెచ్‌వో పద్మావతి

కోట, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని చిట్టేడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని బుధవారం అడిషనల్ డీఎం అండ్ హెచ్‌వో పద్మావతి తనిఖీ చేశారు. ఆరోగ్య కేంద్రంలోని రికార్డులను పరిశీలించారు. ఆస్పత్రిలోని రోగుల గదులు, ల్యాబ్‌లను పరిశీలించారు. ఆరోగ్య కేంద్రం పరిధిలోని గ్రామాల్లో జ్వర పీడితులపై ఆరా తీశారు. వైద్యాధికారులు డాక్టర్ వెంకట రమణ, డాక్టర్ నాగరాజు ఆస్పత్రిలో సమస్యలను డీఎం అండ్‌హెచ్‌వో దృష్టికి తీసుకెళ్లారు.

అభివృద్ధి పనులపై పర్యవేక్షణ పెంచాలి



సమావేశంలో మాట్లాడుతున్న డీఎల్‌డీవో వాణి

కోట, జనవరి 22(ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో జరిగే అభివృద్ధి పనులపై పర్యవేక్షణ పెంచాలని డీఎల్‌డీవో వాణి సూచించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం పంచాయతీ కార్యదర్శులు, ఏఎన్ఎంలు, డిజిటల్, వెల్ఫేర్ అసిస్టెంట్లతో సమావేశం నిర్వహించారు. పంచాయతీల్లో పారిశుధ్యంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. మురుగు కాలువల్లో బ్లీచింగ్ చల్లి, తాగునీటి ట్యాంకుల్లో క్లోరినేషన్ చేపట్టాలన్నారు. అలాగే గ్రామాల్లో జ్వరాల నివారణకు, దోమలను తరిమికొట్టేందుకు ఫాగింగ్ చేయాలని సూచించారు. సమావేశంలో ఎంపీడీవో వేణు, ఇతరశాఖల అధికారులు పాల్గొన్నారు.

విద్యార్థులకు విజయదీపిక పుస్తకాల పంపిణీ

తడ, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): పదో తరగతి విద్యార్థులకు విజయదీపిక పుస్తకాలను ఎంపీపీ కొలవి రఘురెడ్డి చేతుల మీదుగా అందజేశారు. బుధవారం ఎంపీడీవో సమావేశ మందిరంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఎంపీడీవో విజయకుమార్, ఎంఈవో మల్లికార్జున, ఉన్నత పాఠశాలల ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.

ఆధార్ నమోదు

బాలాయపల్లి, జనవరి 22(ఆంధ్రజ్యోతి): బాలాయపల్లిలో చిన్నారులకు బుధవారం ఆధార్ నమోదు చేపట్టారు. ఈ సందర్భంగా ఎంపీడీవో వినీల్ కుమార్ మాట్లాడుతూ ప్రభుత్వం ప్రతి చిన్నారికి ఆధార్ నమోదు చేయించాలని ఆదేశించడంతో ప్రత్యేక కేంద్రాలను ఏర్పాటు చేయించామన్నారు. గురువారం నిండలి సచివాయంలో ప్రత్యేక శిబిరం ఉంటుందని, ఆధార్ లేనివారు నమోదు చేయించుకోవాలని సూచించారు.

అన్నదానం

గూడూరు, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): స్థానిక గమళ్లపాళెంలోని సాయిరాం చారిటీస్ వృద్ధాశ్రమంలోని వృద్ధులకు బుధవారం శ్రీకృష్ణ సేవాసమితి అధ్యక్షుడు మయూరి శ్యామ్‌యాదవ్ సహకారంతో అన్నదానం చేశారు. కార్యక్రమంలో కల్యాణి తదితరులు పాల్గొన్నారు.

ప్రశాంతంగా జేఈఈ మెయిన్స్

కోట, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని విద్యానగర్ ఎన్‌బీకేఆర్ ఇంజనీరింగ్ కళాశాలలో బుధవారం జేఈఈ మెయిన్స్ పరీక్షలు ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. 87మంది పరీక్షలు రాయాల్సి ఉండగా 81మంది హాజరయ్యారు. పరీక్షా కేంద్రాలను తహసీల్దారు జయజయరావు పరిశీలించారు.

చెంగాళమ్మకు వెండి వస్తువుల బహూకరణ



సహాయ కమిషనర్ ప్రసన్నలక్ష్మికి వెండి పాత్రలను అందజేస్తున్న ఇమ్మానేని దంపతులు

సూళ్లూరుపేట, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): చెంగాళమ్మ పరమేశ్వరి నైవేద్యానికి ఉపయోగించే వెండి పాత్రలను సూళ్లూరుపేటకు చెందిన ఇమ్మానేని చంద్రశేఖర రావు, చంద్రమతి, ఇమ్మానేని సత్యనారాయణ, బాబామని దంపతులు బహూకరించారు. బుధవారం రూ.7.50 లక్షల విలువ చేసే 6 కిలోల 400 గ్రాముల బరువు గల రెండు వెండి పాత్రలను సహాయ కమిషనర్ ప్రసన్నలక్ష్మికి అందజేశారు. కార్యక్రమంలో ఇమ్మానేని శ్రీనివాసరావు దంపతులు, ఆలయ సిబ్బంది కామేశ్వరరావు పాల్గొన్నారు.

బలిజ మహిళల అభ్యున్నతికి కృషి



యువతికి చీరలు, సారె అందజేస్తున్న బలిజ మహిళా సంక్షేమ సంఘం ప్రతినిధులు

గూడూరు, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): పేద బలిజ యువతులు, మహిళల అభ్యున్నతికి బలిజ మహిళా సంక్షేమ సంఘం కృషి చేస్తుందని ఆ సంఘం గౌరవ అధ్యక్షురాలు సారంగం సులక్ష్మి అన్నారు. బుధవారం సైదాపురం మండలం ఆర్ఆర్‌పురం గ్రామానికి చెందిన చందన అనే యువతికి పెళ్లికి అవసరమైన చీరలు, సారెను అందజేశారు. ఈ సందర్భంగా సులక్ష్మి మాట్లాడుతూ తల్లిదండ్రులు లేని చందనకు తమ సంఘం ఆధ్వర్యంలో పెళ్లికి అవసరమైన పట్టు చీరలు, కొత్తబట్టలు, పరుపులు, దిండ్లు, అత్తవారి ఇంటికి అవసరమైన అన్ని వస్తువులను అందజేయడం జరిగిందన్నారు. తమ సంఘం ఆధ్వర్యంలో రాష్ట్రంలో అర్హులైన పేద జలిజ మహిళలను ఆదుకుంటామన్నారు. కార్యక్రమంలో పద్మావతి, సువర్ణలక్ష్మి, అరుణ, ఉమాదేవి, ఉషా, సరోజనమ్మ తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణ పోరాట సభను విజయవంతం చేయండి



దామానెల్లూరులో ప్రచారం చేస్తున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

సూళ్లూరుపేట, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): ఎస్సీ వర్గీకరణ చట్టబద్దత కోసం ఫిబ్రవరి 7న హైదరాబాదులో జరిగే లక్ష డప్పులు, వెయ్యి గొంతుల పేరుతో నిర్వహిస్తున్న సభను విజయవంతం చేయాలని సూళ్లూరుపేట నియోజకవర్గ ఎమ్మార్పీఎస్ నాయకుడు కుక్కముల్లి రవి పిలుపునిచ్చారు. బుధవారం మండల పరిధిలోని దామానెల్లూరు, మంగళంపాడు గ్రామాల్లో పర్యటించి ఎస్సీ వర్గీకరణ ఉద్యమంలో ప్రతిగ్రామం నుంచి అందరూ పాల్గొనాలని కోరారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నాయకులు రఘు, సార్థకుమార్, తిరుపాల్, కృష్ణయ్య, మహిళా మండలి అధ్యక్షురాలు మాసారం చెంగమ్మ, వెంకటరమణయ్య, చెంగయ్య తదితరులు పాల్గొన్నారు.

కోటి సభ్యత్వ నమోదు చరిత్రాత్మకం: టీడీపీ

పెళ్లకూరు, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): కోటి మంది సభ్యత్వ నమోదుతో టీడీపీ చరిత్ర సృష్టించిందని ఆ పార్టీ మండల అధ్యక్షుడు సంచి కృష్ణయ్య అన్నారు. బుధవారం ఆయన కొత్తూరులోని టీడీపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. కోటి మంది సభ్యత్వ నమోదు ఘనత మంత్రి నారా లోకేశ్‌దేనని అన్నారు. గురువారం సూళ్లూరుపేట పట్టణంలో ఎమ్మెల్యే విజయశ్రీ, నియోజకవర్గ ఇన్‌చార్జి, మాజీ ఎంపీ నెలవల సుబ్రహ్మణ్యం ఆధ్వర్యంలో నిర్వహించే మంత్రి లోకేశ్ జన్మదిన వేడుకల్లో టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొని విజయవంతం చేయాలని ఆయన కోరారు. కార్యక్రమంలో స్వర్ణముఖినది ఆనకట్ట సిస్టమ్ ప్రాజెక్ట్ కమిటీ చైర్మన్ దామెర ప్రసాద్‌నాయుడు, నాయకులు నేలవల్లి సిద్దులయ్య నాయుడు, మాడుపూరు మురళీ నాయుడు తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధే లక్ష్యంగా పని చేయండి



సమావేశంలో మాట్లాడుతున్న డీఎల్‌పీవో వాణి

వాకాడు, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): పల్లెల్లో అభివృద్ధే లక్ష్యంగా అధికారులంతా ప్రజాప్రతినిధులతో కలిసి పనిచేయాలని డీఎల్‌పీవో వాణి అన్నారు. బుధవారం మండల పరిషత్ కార్యాలయంలో అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ 6 సంవత్సరాల లోపు పిల్లలను గుర్తించి ఆధార్ నమోదు చేయించాలని సూచించారు. అలాగే గ్రామాల్లో పారిశుధ్య పనులు చేపట్టి శుభ్రంగా ఉండేలా చూడాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో అన్నపూర్ణరావు, ఏవో శ్రీనివాసరావు, ఈవోపీఆర్‌డీ ఉమామహేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీల్లో పోషకాహార తోటలు



అంగన్‌వాడీ కేంద్రంలో ఆకుకూర తోటను పరిశీలిస్తున్న సీడీపీవో

వెంకటగిరి టౌన్, జనవరి 22(ఆంధ్రజ్యోతి): వెంకటగిరి ఐసీడీఎస్ పరిధిలోని 52 అంగన్‌వాడీ కేంద్రాల్లో పోషకాహార తోటల పెంపకానికి ప్రభుత్వం అనుమతులు ఇచ్చిందని సీడీపీవో షంషాద్ బేగం తెలిపారు. బుధవారం ఆమె పలు అంగన్‌వాడీ కేంద్రాలను పరిశీలించారు. గర్భిణులు, చిన్నారులకు పోషకాహారం అందించేందుకు ఆర్గానిక్ ఎరువులతో ఆకుకూరలు, కూరగాయలను పండిస్తామన్నారు.

ఎన్‌బీకేఆర్ అధ్యాపకుడికి డాక్టరేట్



సునీల్‌ను అభినందిస్తున్న డైరెక్టర్, విభాగాధిపతులు

కోట, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని విద్యానగర్ ఎన్‌బీకేఆర్ ఇంజనీరింగ్ కళాశాలలో కంప్యూటర్ సైన్స్ అధ్యాపకుడు పొద్దుటూరు సునీల్‌కు డాక్టరేట్ లభించింది. అనంతపురంలోని శ్రీకృష్ణదేవరాయ యూనివర్సిటీ ప్రొఫెసర్ డాక్టర్ రఘునాథరెడ్డి పర్యవేక్షణలో సునీల్ 'సెంతనింగ్ డి రిలయబిలిటీ అండ్ కంజెసన్ కంట్రోల్ ఆఫ్ ఫ్లయింగ్ అరహాక్ నెట్‌వర్క్స్ బై ఇంప్లిమెంటి మల్టీపాక్ రౌటింగ్ ప్రోటోకాల్స్ టూ డిజైన్ ఎన్ ఇంమాక్యూలేట్ అండ్ డెక్రస్ పోకాలజీ ఫర్ సెక్యూర్డ్ డేటా ట్రాన్స్‌మిషన్ అనే అంశంపైపరిశోధన చేశారు. బుధవారం కళాశాల డైరెక్టర్ డాక్టర్ విజయ కుమార్‌రెడ్డి, విభాగాధిపతులు డాక్టర్ రాజశేఖర్‌రెడ్డి, డాక్టర్ నారాయణరావు ప్రశంసాపత్రం, షీల్డ్‌తో సునీల్‌ను అభినందించారు.

తగిన మోతాదులో పురుగు మందులు వాడాలి



రైతులకు అవగాహన కల్పిస్తున్న ఏడీఏ నాగర్జున సాగర్

వెంకటగిరి టౌన్, జనవరి 22(ఆంధ్రజ్యోతి): పంటలకు తగిన మోతాదులోనే పురుగు మందులు వాడాలని ఏడీఏ నాగర్జున సాగర్ అన్నారు. బుధవారం మండల పరిధిలోని చిన్నపురెడ్డిపల్లిలో రైతులకు అవగాహన కల్పించారు. ఆకు ముడత పురుగు ఆశించిందని, దాని నివారణకు కార్టాప్ హైడ్రోక్లోరైడ్ మందును పిచికారీ చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఏవో సుజాత, సిబ్బంది పాల్గొన్నారు.

భూముల రీసర్వే

కోట, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని అల్లంపాడు లో భూముల రీ సర్వేను తహసీల్దారు జయజయరావు బుధవారం ప్రారంభించారు. ఈ పంచాయతీలో ఉన్న 831.23 ఎకరా లను రీసర్వే చేయనున్నారు. ఇందుకోసం సర్వేయర్లు, వీఆర్వోలతో నాలుగు బృందాలను ఏర్పాటు చేశారు. మండల సర్వేయర్ గోపిరెడ్డి, ఆర్ఐ మధులత పాల్గొన్నారు.

ఓజిలి: మండలంలో భూముల రీ సర్వే ప్రారంభమైంది. గతంలో జరిగిన రీ సర్వేలో అవకతవకలు జరగడంతో మళ్లీ సర్వే ప్రారంభించారు. బుధవారం ఏనుగువాడలో జరుగుతున్న రీ సర్వే ప్రక్రియను సర్వే విభాగం డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ హరిహర, టీడీ మధుసూదనరాజుతో కలసి పరిశీలించారు.

ప్రభుత్వ పథకాలను అర్హులకు చేర్చండి

ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఆదిమూలం

బుచ్చినాయుడుకండ్రిగ, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): ప్రజా ప్రతినిధులు ప్రభు త్వ పథకాలను అర్హులకు చేర్చాలని ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం పిలుపు ని చ్చారు. మండల పరిషత్ కార్యాలయంలో వైస్ ఎం పీపీ మునికృష్ణారెడ్డి అధ్య క్షతన బుధవారం మండల సర్వసభ్య సమా వేశం జరిగింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ... మండలా భివృద్ధి కోసం అనేక ప్రణాళికలు తయారు చేస్తున్నామన్నారు. ఇప్పటికే రూ.2 కోట్లతో సిమెంట్ రోడ్ల నిర్మాణాలు జరు గుతున్నా యన్నారు. ఆలత్తూరు, జంబుగోళం రోడ్డు, పెద్దపాలేడు రోడ్లకు మరమ్మతులు చేపడుతున్నామన్నారు. సూళ్లూరుపేట రోడ్డుకు తిరిగి ప్రతిపాదనలు చేస్తున్నట్లు చెప్పారు. ఎస్సీ, ఎస్టీలకు గోకులం షెడ్లు మంజూరు చేస్తామన్నారు. అర్హులైన వారందరికి త్వరలోనే రేషన్‌కార్డులు మంజూరవుతాయన్నారు. రైతులు నుంచి ధాన్యం కొనుగోలు తక్షణం చేపట్టాలని వ్యవసాయ అధికారులను కోరారు. శ్మశానంకు రోడ్డు లేని గ్రామాలను గుర్తించాలని, గ్రామా ల్లో విద్యుత్ సమస్యలను పరిష్కరించాలని స ర్పంచులు సభ దృష్టికి తీసుకు వచ్చారు. వ్య వసాయ అధికారి భారతి మాట్లాడుతూ . ప్ర భుత్వం ధాన్యం ధరను ప్రస్తుతం క్వింటాలుకు రూ.2300లుగా నిర్ణయించిందన్నారు. అయితే ఈ- క్రాప్ చేసుకున్న రైతుల నుంచే ధాన్యం కొనుగోలు చేస్తామన్నారు. ఎంపీడీవో త్రివిక్రమ్‌రావు, తహసీల్దార్ సుబ్రమణ్యం, ఈవోపీఆర్డీ రాజశేఖర్, ఎస్ఐ విశ్వనాథ నాయుడు ఎంపీటీసీ సభ్యులు, సర్పంచులు తదితరులు పాల్గొన్నారు.

పుత్తూరు వార్తలు

రహదారి భద్రత.. కుటుంబానికి రక్ష


వాకథాన్ నిర్వహిస్తున్న కళాశాల విద్యార్థులు

పుత్తూరు అర్బన్, జనవరి 22(ఆంధ్రజ్యోతి): రహదారి భద్రత.. కుటుంబానికి రక్ష అని పుత్తూరు వాహన తనిఖీ అధికారి(ఎంవీఐ) చంద్రశేఖర్ పేర్కొన్నారు. జాతీయ రహదారి భద్రతా మాసోత్సవాల్లో భాగంగా బుధవారం వేదవ్యాస ప్రైవేటు డిగ్రీ కళాశాలలో విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. అనంతరం కళాశాల నుంచి నారాయణవనం రోడ్డు బైపాస్ వరకు వాకథాన్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంవీఐ మాట్లాడుతూ... హెల్మెట్ ధరించి ద్విచక్ర వాహనం నడపాలని సూచించారు. సీట్ బెల్ట్ ధరించి కారు నడపడంతో ప్రమాదాల సమయంలో ప్రాణాలతో భయటపడవచ్చన్నారు. అతి వేగం, మద్యం తాగి వాహనాలు నడపడం, సెల్ ఫోన్ డ్రైవింగ్, ఓవర్ లోడ్ వంటి ప్రమాద కారణాలను వివరించారు. తల్లిదండ్రులు 18 సంవత్సరాలు నిండిన తమ పిల్లలకు రహదారి భద్రత పట్ల అవగాహన కల్పించాల్సి ఉందన్నారు. ముఖ్యంగా డ్రైవింగ్ లైసెన్సు లేకుండా వాహనాలు నడపరాదని, ట్రిపుల్ రైడింగ్ చేయరాదని సూచించారు.. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ అనిల్‌కుమార్, గోపి, రవాణాశాఖ కానిస్టేబుల్ నరేంద్రబాబు పాల్గొన్నారు.

శివాలయ కుంభాభిషేకానికి ఎమ్మెల్యేకు ఆహ్వానం


ఎమ్మెల్యేను సత్కరిస్తున్న ఆలయ నిర్వాహకులు

పుత్తూరు అర్బన్, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని చెర్లోపల్లి 21వ వార్డులో కొలువై ఉన్న కామాక్షి దేవి సమేత సిద్ధేశ్వర స్వామి ఆలయ కుంభాభిషేక మహోత్సవానికి ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్‌ను కార్య నిర్వాహకులు ఆహ్వానించారు. ఈ మేరకు బుధవారం వారు ఎమ్మెల్యేను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ నెల 30వ తేదీ నుంచి ప్రత్యేక పూజా కార్యక్రమాలు చేపట్టనున్నట్లు వారు తెలియజేశారు. ఫిబ్రవరి 3వ తేదీన జరిగే మహాకుంభాభిషేకం అత్యంత వేడుకగా నిర్వహిస్తామన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సత్కరించారు. టీడీపీ పట్టణ అధ్యక్షుడు జీవరత్నం నాయుడు, గోపాల్ యాదవ్, ఆనంద్, శివయ్య, చెన్నారెడ్డి, లోకయ్య, కోటిరెడ్డి, రమేష్, లోకారెడ్డి, దినకర్ రెడ్డి పాల్గొన్నారు.

నేడు మంత్రి లోకేశ్ జన్మదిన వేడుకలు

పుత్తూరు అర్బన్, జనవరి 22(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర మంత్రి లోకేశ్ జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించనున్నట్లు టీడీపీ పట్టణ అధ్యక్షుడు జీవరత్నం నాయుడు పేర్కొన్నారు. ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్ హాజరవుతారన్నారు. కార్వేటినగరం రోడ్డు కూడలిలో కేక్ కటింగ్ ఉంటుందన్నారు. ఈ కార్యక్రమానికి కూటమి నాయకులు, యువత పెద్ద సంఖ్యలో తరలివచ్చి విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

దివంగత అటవీశాఖాధికారి ఫ్యామిలీ పెన్షన్‌లో రికవరీ

పుత్తూరు, జనవరి 22(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వానికి ఆర్థిక పరమైన నష్టం కలిగించిన దివంగత పుత్తూరు ఫారెస్ట్ అధికారి సుబ్రహ్మణ్యం మీద చర్యలు తీసుకోవాలని ఆదేశిస్తూ బుధవారం ప్రభు త్వం ఉత్తర్వులు జారీ చేసింది, గతంలో పుత్తూరు అటవీశాఖాధికారిగా పనిచేస్తూ ఆయన పదవీ విరమణ తర్వాత రెండేళ్ల క్రితం మరణించారు. ప్రస్తుతం ఆయన వారసులు పెన్షన్‌ను పొందుతున్నారు. ఈ క్రమంలో గతంలో ఆయన మీద నమోదైన దాదాపు 12 కేసుల పూర్వాపరాలను పరిశీలించిన రాష్ట్రప్రభుత్వ ప్రత్యేక అధికారి అనంతరాము ఈ మేరకు ఉత్తర్వులను జారీ చేశారు. ఆయన ఫ్యామిలీ పెన్షన్ నుంచి ప్రభుత్వ నష్టాన్ని వసూలు చేయాలని జిల్లా అటవీశాఖాధి కారులను ఆదేశించారు.

నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు


సూచనలిస్తున్న డ్రగ్స్ అధికారి రీతు

పుత్తూరు, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ల అనుమతులు, తప్పనిసరి బిల్లులతో మందుల విక్రయాలు జరపాలని మెడికల్ షాపుల యజమానులను తిరుపతి జిల్లా మెడికల్ అండ్ డగ్స్ అధికారి రీతు ఆదేశించారు. పట్టణంలోని మెడికల్ షాపు యజమానులతో బుధవారం అవగాహన సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నిబంధనలకు విరుద్ధంగా షాపులను నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. షాపులో ఫార్మాసిస్ట్ ఉండాలని, యజమానికి కంప్యూటర్ పరిజ్ఞానం వుండాలన్నారు. ఈ కార్యక్రమంలో రత్నం, రామ్‌గుప్తా, నరసింహారావు, వెంకటేష్, నరసింహులు తదితరులు పాల్గొన్నారు.

రైల్వే ప్లాట్‌ఫారంపై కానరాని డిస్‌ప్లే బోర్డులు

ఇబ్బందుల్లో రిజర్వేషన్ చేసుకున్న ప్రయాణికులు


ఖాళీగా ఉన్న స్తంభాలు

పుత్తూరు, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): పుత్తూరు రైల్వేస్టేషన్ ప్లాట్ ఫారం మీద బోగీల డిస్‌ప్లే బోర్డులు లేకపోవడంతో రాత్రి పూట ప్రయాణికులు పరుగులు తీయాల్సి వస్తోంది. రాత్రుల్లో దాదాపు ఎనిమిది దూరప్రాంత రైళ్లు స్టేషన్‌లో ఆగుతుంటాయి. సాయంత్రం 6 గంటల నుంచి తెల్లవారు జామున 5 గంటల మధ్య చెన్నై - కాచిగూడ, చెన్నై - ముంబై, చెన్నై - తిరుపతి, పాండిచ్చేరి - తిరుపతి మధ్య రైళ్లు తిరుగుతుంటాయి. దూరప్రాంత రైళ్లు 24 స్లీపర్, ఏసి బోగీలను కలిగి ప్లాట్ ఫారం చివర వరకు ఆగుతుంటాయి. రిజర్వేషన్ చేసుకున్న ప్రయాణికులు రైలు ఆగిన ఐదు నిమిషాల్లో బోగీల్లో ఎక్కేందుకు డిస్‌ప్లే బోర్డులు లేక ఇబ్బందులు పడుతున్నారు. రెండు రోజుల కిందట ఓ మహిళ పడుతున్న ప్రయాసను చూసి తోటి ప్రయాణికుడు టీసీని అప్రమత్తం చేసి రైలును కొంత సేపు ఆపి ఎక్కించారు. ఇలాంటి సంఘటనలు ప్రతి రోజు జరుగుతున్నాయి. డిస్‌ప్లే బోర్డులను ఏర్పాటు చేయాలని ప్రయాణికులు కోరుతున్నారు.

నేడు దుండి వినాయకస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు

నారాయణవనం, జనవరి 22(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని దుండి వినాయకస్వామి ఆలయంలో రాష్ట్ర విద్యా శాఖ మంత్రి లోకేశ్ జన్మదినం సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నట్లు జడ్పీటీసీ సభ్యుడు సుమన్ కుమార్ తెలిపారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే ఆదిమూలం ముఖ్య అతిథిగా హాజరవుతారని చెప్పారు.

ప్రభుత్వ వసతిగృహాలకు మంచిరోజులు: ఎమ్మెల్యే సుధీర్


హాస్టల్‌ను ప్రారంభిస్తున్న కలెక్టర్ - విద్యార్థినులతో ముచ్చటిస్తున్న కలెక్టర్, ఎమ్మెల్యే సుధీర్ - గది లోపల పరిశీలిస్తున్న ఎమ్మెల్యే తదితరులు


కొత్త సొబగులతో బాలికల వసతిగృహం

శ్రీకాళహస్తి, జనవరి 22(ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలో ప్రభుత్వ వసతి గృహాలకు మంచిరోజులు వచ్చాయని ఎమ్మెల్యే సుధీర్ చెప్పారు. శ్రీకాళహస్తి పట్టణం తెలుగుగంగ కాలనీలోని ప్రభుత్వ బాలికల వసతిగృహాన్ని ఇటీవల ఆయన తనిఖీ చేశారు. అక్కడ అధ్వాన పరిస్థితులను చూసి ఆయన స్పందించారు. యుద్ధ ప్రాతిపదికన వసతిగృహానికి అవసరమైన మరమ్మతులను చేపట్టారు. కొత్త హంగులతో సిద్ధమైన వసతిగృహాన్ని కలెక్టర్ వెంకటేశ్వర్ చేతుల మీదుగా బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా సుధీర్ మాట్లాడుతూ తాను ఎమ్మెల్యేగా గెలిచిన వెంటనే వసతిగృహాల అభివృద్ధిపై దృష్టి సారించానన్నారు. తన సొంత నిధులతో వసతిగృహాన్ని బాగు చేసి నెల రోజుల్లోనే అందుబాటులోకి తీసుకువచ్చానన్నారు. కలెక్టర్ వెంకటేశ్వర్ మాట్లాడుతూ కార్పొరేట్ స్థాయిలో ప్రభుత్వ వసతిగృహాన్ని ఎమ్మెల్యే నిస్వార్థంగా అభివృద్ధి చేయడం అభినందనీయమన్నారు.ఈ కార్యక్రమంలో ఆర్డీవో భానుప్రకాష్‌రెడ్డి, ముక్కంటి ఆలయ ఈవో బాపిరెడ్డి, టీడీపీ నాయకులు విజయకుమార్, కంఠా రమేష్, రవీంద్రనాథ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ముక్కంటి సేవలో ఎస్టీ కార్పొరేషన్ చైర్మన్


ఆలయం వద్ద బొరగం శ్రీనివాసులు


శ్రీకాళహస్తి, జనవరి 22(ఆంధ్రజ్యోతి): జ్ఞానప్రసూనాంబ సమేత శ్రీకాళహస్తీశ్వర స్వామిని బుధవారం రాష్ట్ర ఎస్టీ కార్పొరేషన్ చైర్మన్ బొరగం శ్రీనివాసులు దర్శించుకున్నారు. ఆలయ అధికారులు స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. దర్శనానంతరం మృత్యుంజయస్వామి సన్నిధి వద్ద వేదపండితులు ఆశీర్వచనం ఇచ్చి స్వామిఅమ్మవార్ల జ్ఞాపిక, తీర్థప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు సుబ్బయ్య, రమేష్, వజ్రం కిషోర్, సురేష్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

ఎస్ఐ భౌతికకాయానికి ఎమ్మెల్యే నివాళి


ప్రభుత్వ లాంఛనాలతో ఎస్ఐ అంత్యక్రియలు

పిచ్చాటూరు, జనవరి 22(ఆంధ్రజ్యోతి): అనారోగ్యంతో మరణించిన పిచ్చాటూరువాసి ఊత్తుకోట ఎస్ఐ రాజేంద్రన్ భౌతికకాయానికి ఎమ్మెల్యే ఆదిమూలం నివాళులర్పించారు. రాజేంద్రన్ స్వగృహానికి చేరుకుని నివాళులర్పించిన అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించారు. అలాగే ఎస్ఐ రాజేంద్రన్‌కు తమిళనాడు పోలీసులు ఘన నివాళులర్పించారు. సాయంత్రం తమిళనాడు డీఎస్పీ శాంతి ఆధ్వర్యంలో సీఐ దేవరాజ్, ఎస్ఐ ప్రసన్న వరదన్‌లతో కలసి భారీగా పోలీసులు పిచ్చాటూరుకు చేరుకుని గజమాలతో అశ్రునివాళులర్పించారు. తమిళనాడు ప్రభుత్వం మట్టి ఖర్చులకు అందించిన రూ.లక్షను డీఎస్పీ శాంతి చేతుల మీదుగా రాజేంద్రన్ భార్య తిలగవదికి అందజేశారు.

సైన్స్, మ్యాథ్స్ ఒలంపియాడ్‌లో ది స్కూల్ విద్యార్థుల ప్రతిభ



శ్రీకాళహస్తి, జనవరి 22(ఆంధ్రజ్యోతి): జాతీయ స్థాయి సైన్స్, మ్యాథ్స్ ఒలంపియాడ్‌లో ది స్కూల్ విద్యార్థులు ప్రతిభ చూపినట్టు కరస్పాండెంట్ జనార్దన్ పవార్ చెప్పారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డిల్లీలో గత నెలలో నిర్వహించిన ఒలంపియాడ్‌లో 153మందికి గాను 34మంది రెండో స్థాయికి అర్హత సాధించారన్నారు. అదే విధంగా మ్యాథ్స్ ఒలంపియాడ్‌లో 112 హాజరు కాగా 30మంది రెండో స్థాయికి అర్హత సాధించినట్లు తెలిపారు. ప్రధానోపాధ్యాయురాలు విశాల, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

ఇంటి స్థలాల కోసం ఫెన్సింగ్ ధ్వంసం


ఫెన్సింగ్‌ను ధ్వంసం చేస్తున్న కనమనంబేడువాసులు

బుచ్చినాయుడుకండ్రిగ, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కనమనంబేడు వాసులు ఇంటి స్థలాల కోసం సీపీఐ నాయకుల ఆధ్వర్యంలో ధర్నా చేశారు. మండల సర్వసభ్య సమావేశానికి వచ్చిన ఎమ్మెల్యే ఆదిమూలాన్ని అడ్డుకున్నారు. ఈ సందర్భంగా గ్రామస్తులు మా ట్లాడుతూ... సర్వే నెం.252, 253లలో ఉన్న భూమిలో ఇంటి పట్టాలివ్వాలని డిమాండ్ చేశారు. స్థానికేతురుడైన డాక్టర్ బత్తెయ్య నాయుడు ఎకరా 75 సెంట్లకు ఫెన్సింగ్ వేశా రని తెలిపారు. దీనిపై ఎమ్మెల్యే ఆదిమూలం, తహసీల్దార్ సుబ్రమణ్యం మాట్లాడుతూ బత్తెయ్యనాయుడు కంచె వేసిన భూమి కోర్టు పరిధిలో ఉందన్నారు. దీనిపై జిల్లా అధికారులకు సమాచారం ఇచ్చామన్నారు. దీనికి సంతృప్తి చెందని గ్రామస్తులు ఫెన్సింగ్‌ను ధ్వంసం చేశారు. దీనిపై బత్తెయ్యనాయుడు పోలీసులకు ఫిర్యాదు చేశారు. చర్యలు తీసుకుంటామని ఎస్ఐ విశ్వనాథ నాయుడు తెలిపారు.

పేదలకు ఇళ్ల స్థలాలివ్వాలి: సీపీఐ


సమావేశంలో మాట్లాడుతున్న చిన్నిరాజ్

వరదయ్యపాళెం, జనవరి 22 (ఆంధ్రజ్యోతి) కూటమి ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు పేదలకు పట్టణ ప్రాంతాల్లో రెండు సెంట్లు, గ్రామీణ ప్రాంతాల్లో మూడు సెంట్లు వెంటనే ఇవ్వాలని సీపీఐ నాయోజకవర్గ నాయకుడు అంబాకం చిన్నిరాజ్ డిమాండ్ చేశారు. సత్యవేడు నియోజకవర్గ సీపీఐ సమావేశం బుధవారం వరదయ్యపాళెంలో జరిగింది. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా పాల్గొన్న చిన్నిరాజ్ మాట్లాడుతూ... ఇటీవల జరిగిన రెవెన్యూ సదస్సుల్లో వచ్చిన భూ సమస్యలను పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ నాయకులు సుభాష్, అన్నాదురై, సీపీఐ మండల కార్యదర్శి తరుణ్‌కుమార్, వ్యవసాయ కార్మిక సంఘం కార్యదర్శి చంద్ర, రైతు సంఘం నాయకులు ధనుంజయులు, మునిచంద్ర, ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

పరశురామేశ్వరుడి సేవలో కలెక్టర్



ఏర్పేడు, జనవరి 22(ఆంధ్రజ్యోతి): మండలంలోని గుడిమల్లం పరశురామేశ్వరుడిని కలెక్టర్ వెంకటేశ్వర్ బుధవారం ఎమ్మెల్యే సుధీర్‌తో కలిసి దర్శించుకున్నారు. ఆలయ అధికారులు వారికి స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. దర్శనానంతరం వేదపండితులు వారిని ఆశీర్వదించారు. రానున్న మహాశివరాత్రి ఉత్సవాలపై అధికారులతో సమీక్షించారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో భానుప్రకాష్‌రెడ్డి, టీడీపీ నాయకులు ధనంజయులునాయుడు, గిరినాయుడు తదితరులు పాల్గొన్నారు.

హైలెవల్ వంతెన నిర్మాణానికి ప్రతిపాదనలు సిద్ధం చేయండి


వంతెన పరిశీలనలో కలెక్టర్

ఏర్పేడు, జనవరి 22(ఆంధ్రజ్యోతి): మండలంలోని గోవిందవరం - మునగలపాళెం మధ్య స్వర్ణముఖి లోలెవల్ వంతెనపై యేటా వర్షాకాలంలో సుమారు 20 రోజుల పాటు ఉధృతంగా నీరు ప్రవహిస్తుంది. దీంతో చుట్టుపక్కల గ్రామాలకు రాకపోకలు స్తంభిస్తుంటాయి. దీనిపై చుట్టుపక్కల గ్రామస్తులు ఎమ్మెల్యే సుధీర్ దృష్టికి తీసుకెళ్లారు. ఈ క్రమంలో సమస్యను కలెక్టర్ వెంకటేశ్వర్‌కు ఎమ్మెల్యే విన్నవించారు. దీంతో బుధవారం గోవిందవరం వద్ద స్వర్ణముఖి నదిపై లోలెవల్ వంతెనను కలెక్టర్ పరిశీలించారు. హైలెవల్ వంతెన అంచనాలు, ప్రతిపాదనలు సిద్ధం చేసి పంపాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో శ్రీకాళహస్తి ఆర్డీవో భానుప్రకాష్‌రెడ్డి, టీడీపీ నాయకులు ధనంజయులునాయుడు, నాగరాజునాయుడు, చిరంజీవులునాయుడు తదితరులు పాల్గొన్నారు.

పందులకు నిలయంగా ఆర్టీసీ బస్టాండు పరిసరాలు



రేణిగుంట, జనవరి 22(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఆర్టీసీ బస్టాండు పరిసరాలు పందులకు నిలయంగా మారాయి. బజారువీధిలో కూరగాయల మార్కెట్, హోటళ్లు ఉండడంతో మిగిలిన కూరగాయల వ్యర్థాలు, కుళ్లిన పండ్లు, హోటల్ వ్యర్థాలను ఆర్టీసీ బస్టాండు పరిసరాల్లోని రోడ్డుపక్కన పడేస్తున్నారు. ఆ వ్యర్థాల కోసం పందుల గుమిగూడుతున్నాయి. దీంతో నిత్యం ఈ ప్రాంతంలో పందుల సంచారం అధికమవుతోంది. రాత్రి సమయంలో వీటి సంచారం మరింత ఎక్కువగా కనిపిస్తోంది. దీంతో స్థానికులే కాకుండా వివిధ ప్రాంతాలనుంచి శ్రీవారి దర్శనార్థం వచ్చే భక్తులు ఇబ్బంది పడుతున్నారు. ఈ విషయమై పంచాయతీ అధికారులు స్పందించి పారిశుధ్య నిర్వహణతోపాటు పందుల సంచారం నివారణకు చర్యలు తీసుకోవాల్సి ఉంది.

మెగా పశువైద్య శిబిరం

రేణిగుంట, జనవరి 22(ఆంధ్రజ్యోతి): మండలంలోని కరకంబాడి పంచాయతీ గొల్లపల్లిలో రాస్ మహిళా జ్యోతి మ్యూచువల్ బెనిఫిట్ ట్రస్టు ఆధ్వర్యంలో మెగా పశువైద్య ఉచిత శిబిరాన్ని బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా పశువులకు, జీవాలకు వైద్యపరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. రేణిగుంట ఏరియా పశువైద్యశాల అసిస్టెంట్ డైరెక్టర్ సునీత, రాస్ కేవీకే పశు వైద్యురాలు అనూష, సిబ్బంది పాల్గొన్నారు.

కేవీబీపురం(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో బుధవారం పశువైద్యాధికారి హరీష్ ఆధ్వర్యంలో పశు వైద్య శిబిరం నిర్వహిం చారు. నట్టల నివారణకు, గాలికుంటువ్యాధికి, దూడలకు పురుగుమందులను పాడి రైతులకు అందించారు.

పిచ్చాటూరు(ఆంధ్రజ్యోతి): రైతుల అభివృద్ధి కోసం ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న పశు వైద్య శిబిరాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని పశు వైద్యాధికారిణి ప్రశాంతి తెలిపారు. బుధవారం మండలంలోని కొత్త గొల్లకండ్రిగలో ఉచిత పశు వైద్య శిబిరం నిర్వహించారు. సుమారు 100 పశువులకు వైద్య పరీక్షలు నిర్వహించి తగిన చికిత్సలు అందించారు. గర్భకోశ వ్యాధులు, సూడి పరీక్షలు, పిడుదులు దోమల నివారణ కోసం బూటాక్స్ మందును పశువులపై పిచికారి చేశారు. పశు వైద్య సిబ్బంది చందన, అజిత్ తదితరులు పాల్గొన్నారు.

పింఛన్ల తనిఖీ


తనిఖీలో పాల్గొన్న అధికారులు

పిచ్చాటూరు, జనవరి 22(ఆంధ్రజ్యోతి): దివ్యాంగుల పింఛన్లలో అనర్హులను గుర్తించడానికి ప్రభుత్వం దృష్టి సారించింది. ఇందులో భాగంగా బుధవారం ఎంపీడీవో మహ్మద్‌రఫి ఆధ్వర్యంలో నెల్లూరు ప్రభుత్వ జనరల్ ఆస్పత్రి అసిస్టెంట్ ప్రొఫెసర్లు ఎం.వెంకట్ హరిప్రసాద్, డాక్టర్ రేణుకాదేవి, మండల వైద్యాధికారి హమీద్, వెలుగు సమాఖ్య బృందం మండలంలోని ఇంటి ఇంటికీ వెళ్లి దివ్యాంగులకు వైద్య పరీక్షలు నిర్వహించారు.

నిధుల వినియోగంపై తనిఖీ

పిచ్చాటూరు, జనవరి 22(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం పాఠశాలలకు మంజూరు చేసిన నిధుల వినియోగం, ఖర్చులు, చేపట్టాల్సిన పనులపై బుధవారం సర్వ శిక్ష డైరెక్టరేట్ ఏర్పాటు చేసిన డీఆర్పీ బృందం పిచ్చాటూరు జడ్పీ ఉన్నత పాఠశాలలో సామాజిక తనిఖీ చేపట్టింది. బృంద సభ్యులు డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజనం, మరుగుదొడ్లు, తాగునీటి వసతి, ప్రయోగశాల, గ్రంథాలయం, అదనపు గదులు నిర్మాణం, పాఠశాల రికార్డులను తనిఖీ చేశారు. అనంతరం పాఠశాల కమిటీ సభ్యులతో సమావేశం నిర్వహించారు. ప్రధానోపాధ్యాయుడు గిరిప్రకాష్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.